PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 147 | విజయవాడ, శనివారం 30 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు | వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 30 December 2023 | Rs

సమ్మె విచ్ఛిన్నానికి పోటీ కార్మికులు

- అద్దుకున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిన సమ్మె

లోపలి పేజీలో..



మీగడ రామలింగస్వామికి ఎన్‌టిఆర్ పురస్కారం అందజేస్తున్న అంబటి

నాటక రంగానికి ప్రోత్సాహం

2

- నంది బహుమతుల ప్రదానోత్సవంలో మంత్రి అంబటి

మార్పు తెచ్చాం...

- బాబు, పవన్‌లవి మోసపూరిత మాటలు
- భీమవరంలో విద్యాదీవెన సభలో సిఎం జగన్



భీమవరంలో బటన్ నొక్కి విద్యాదీవెన నిధులు విడుదల చేస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

విద్యతో పాటు అనేక రంగాల్లో గత నాలుగన్నరేళ్ల కాలంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో శుక్రవారం ఆయన బటన్ నొక్కి విద్యా దీవెన డబ్బులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ విద్య వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, సామాజిక న్యాయం, పరిపాలన ఇలా అనేక రంగాల్లో గణనీయ మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ మార్పులను బట్టే గత ప్రభుత్వానికి తమ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గుర్తించి, ఆలోచించాలన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడ మీద, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌మీద ఆయన విరుచుకుపడ్డారు. పవన్ వివాహాల అంశాన్ని మరోసారి ప్రస్తావించారు. ఆయన జి కోసం త్యాగాలు చేస్తారని విమర్శించారు. మూడు నెలలకోసారి తల్లుల ఖాతాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును తమ ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. మొత్తం 8,09,039 మంది పిల్లలకు బటన్ నొక్కి మొత్తం రూ.583 కోట్లను తాజా కార్యాక్రమంలో జమ చేసినట్లు తెలిపారు. నాలుగున్నరేళ్లలో విద్యా దీవెన పథకం కింద 27.61 లక్షల మంది పిల్లలకు రూ.11,900 కోట్లు పూర్తి స్థాయిలో ఫీజు జమ చేశామన్నారు. వసతి దీవెన కింద ఇప్పటి వరకు రూ.4,275 కోట్లు ఇచ్చామని తెలిపారు. నాడు-నేడు కింద బడులు బాగుపడిన తీరు గమనించాలని కోరారు. మూడో తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్లతో బోధన చేయిస్తున్నామన్నారు. విదేశీ విద్యా దీవెన కింద కోటీ 20 లక్షలు ఇస్తున్నామని తెలిపారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో విద్యారంగానికి రూ.73 వేల కోట్లు ఖర్చు పెట్టామన్నారు. అమ్మ ఒడి, పొదుపు సంఘాలకు చేయూత, 31 లక్షల ఇంటి స్థలాలు, 22 లక్షల ఇళ్లు, డిబిటి కింద రూ.2.45 లక్షల కోట్లు జమ, 50 ఇళ్లకు వలంటరీ వ్యవస్థ, ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థ, అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు, రైతు భరోసా, మూడు రెట్ల పెన్షన్, శాశ్వత బిసి కమిషన్, 17 మెడికల్ కాలేజీలు, పది ఫిషింగ్ హార్బర్‌లు వంటి అనేక కార్యక్రమాలు తమ ప్రభుత్వంలో అమలు చేశామని వివరించారు. ఇంతకంటే మంచి పథకాలు చంద్రబాబు ప్రవేశపెట్టారా అని ప్రశ్నించారు. చంద్రబాబు 14 ఏళ్లపాటు మూడుసార్లు సిఎంగా చేశారని, ఏనాడైనా గుర్తు పెట్టుకోదగిన మంచి చేశాడా? అని ప్రశ్నించారు. చంద్రబాబుకి, దత్తపుత్రుడికి ఒంటరిగా పోటీచేసే సత్తాలేదన్నారు. . ఈ కార్యక్రమంలో మంత్రులు తానేటి వనిత, కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు

లోపలి పేజీలో..

భీమవరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పోలీసుల హల్‌చల్.. వారిస్తున్న జిల్లా కార్యదర్శి బి.బలరాం

విద్యా రంగంపై దాడిని తిప్పికొట్టండి

ఎస్ఎఫ్ఐ బహిరంగ సభలో అఖిల భారత అధ్యక్షులు విపి సాను

- ముగిసిన రాష్ట్ర మహాసభ
- స్ఫూర్తిదాయకంగా సాగిన ప్రదర్శన



బహిరంగ సభకు ర్యాలీగా వెళ్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి, ప్రత్యేక ప్రతినిధి

దేశంలో విద్యా రంగంపై మోడీ ప్రభుత్వం దాడి తీవ్రతరం చేసిందని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి.సాను ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులంతా ఐక్యంగా దీనిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభ ముగింపు సందర్భంగా కాకినాడలో శుక్రవారం విద్యార్థుల భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరిగింది. నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్న ప్రదర్శన స్ఫూర్తి దాయకంగా సాగింది. అనంతరం నిర్వహించిన బహిరంగసభలో సాను మాట్లాడుతూ మోడీ హయాంలో అన్ని రంగాలపైనా దాడి జరుగుతోందన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలపై దేశ చరిత్రలో మొదటిసారిగా 16 విద్యార్థి సంఘాలు ఒకే వేదికపైకొచ్చి గొంతెత్తుతున్నాయని, దేశాన్ని కాపాడాలని, విద్యా రంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ జనవరి 12 'చలో పార్లమెంట్' నిర్వహిస్తున్నాయని తెలిపారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ దేశ వ్యాప్తంగా సమరశీల పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్ (జెఎన్‌యుఎస్‌యు) అధ్యక్షులు ఐషీఘోష్ మట్లాడతూ దేశంలో మోడీ పాలన చూస్తే బ్రిటిష్ పాలన గుర్తుకొస్తోందనినాడు బ్రిటిష్ పాలనలో చదువు కొందరికే ఉండేదని, మోడీ పాలనలో అది పునరావృతం అవుతోందని అన్నారు. అప్పటి బ్రిటిష్ వలస పాలనను దేశ ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టారని, ఇప్పటి మోడీ ప్రభుత్వాన్ని కూడా ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. మోడీ పాలనలో కార్పొరేట్లకు మాత్రమే మంచి రోజులు వచ్చాయన్నారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత పూర్వ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజ మార్పు కోసం జరిగే అన్ని పోరాటాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని అన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. . రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు. పేదలకు విద్యను దూరం చేసే ఎన్ఇపిని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. విద్యార్థుల పోరాటాల ఫలితంగా తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వం ఓటమి పాలైందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వైసిపి సర్కారు తీరును మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

అల్లూరి స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలు : అశోక్

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవ్వాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పిలుపునిచ్చారు. ఎన్ఇపి ఫలితంగా రాష్ట్రంలో రెండు లక్షల మంది విద్యార్థులు విద్యకు మిగతా 7లో

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రసన్న కుమార్, అశోక్



ప్రసన్న కుమార్



అశోక్

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షునిగా కె.ప్రసన్నకుమార్, కార్యదర్శిగా ఎ.అశోక్ ఎన్నికయ్యారు. కాకినాడలో మూడు రోజుల పాటు జరిగిన ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభ శుక్రవారం ముగిసింది. చివరి రోజు 55 మందితో నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఉపాధ్యక్షులుగా పావని (రాష్ట్ర కేంద్రం), పి.రామ్మోహన్ (విజయనగరం జిల్లా), జెఎల్.నాయుడు (విశాఖ), సిహెచ్.వెంకటేశ్వర్లు (ఎన్‌టిఆర్), ఎన్.కిరణ్ (గుంటూరు), సిహెచ్.వినోద్ (ప్రకాశం), అబ్దుల్లా (కర్నూలు), పరమేష్ (అనంతపురం), సహాయ కార్యదర్శులుగా జి.పల్లవి (విశాఖ), ఎస్.కె.జాహీద (ఎన్‌టిఆర్), రవి (తిరుపతి), సిహెచ్.వెంకటేష్ (విజయనగరం), 41 మంది సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాలకు వేగుచుక్కగా నిలిచిన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. తక్షణ కర్తవ్యాలుగా సంక్రాంతి సందర్భంగా ఆటల పోటీలు, రాబోయే రోజుల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సెమినార్లు, పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. జనవరి 12న చలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరు కావాలని, రిజెక్ట్ బిజెపి పేరుతో ఈ కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. కేంద్రం అమలు చేస్తోన్న ఎన్ఇపికి వ్యతిరేకంగా విద్యారంగాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరిస్తాం

దీక్షా శిబిరానికి వెళ్లి చంద్రబాబు సంఘీభావం

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో, కుప్పం

'మేము అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తాం' అని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆయన శాంతిపురం మండలంలో రోడ్డు షో నిర్వహించారు. శాంతిపురంలో అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్దకు వచ్చి వారి పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీల డిమాండ్లు న్యాయబద్ధమైనవి అన్నారు. ఒక్క ఛాన్స్ ఇవ్వాలంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలతోపాటు రాష్ట్రంలోని ప్రజలందరినీ మోసగించారని విమర్శించారు. మళ్లీ ఆయనకు అవకాశం ఇవ్వొద్దని చంద్రబాబు కోరారు. నాలుగు వేల రూపాయలు ఉన్న అంగన్‌వాడీ వర్కర్ల వేతనాన్ని రూ.10,500కు పెంచిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. తాము మళ్లీ అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్ర సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ముద్దులు పెట్టడం, తల నిమరడం చేసి, ఇప్పుడు పిడిగుద్దులు గుద్దుతున్నారని విమర్శించారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకూ ప్రభుత్వంతో పోరాడాలని, ఈ ప్రభుత్వం చేయకపోతే టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు విజ్ఞాపన పత్రం అందజేశారు.



చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు

అంగన్‌వాడీలకు విశాల మద్దతు


- కార్మిక, ప్రజా సంఘాలు, నేతల సంఘీభావం
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిన ఆందోళనలు

లోపలి పేజీలో..

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- ఐలు 14వ అఖిల భారత మహాసభలో జస్టిస్ ఎస్ మురళీధర్ పిలుపు

లోపలి పేజీలో..



శివరామకృష్ణ కుటుంబం (ఫైల్)

స్వర్ణకార కుటుంబం ఆత్మహత్య

ప్రజాశక్తి- అనకాపల్లి

అప్పుల బాధతో అనకాపల్లిలో స్వర్ణకారుని కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. అనకాపల్లిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి డిఎస్‌పి సుబ్బరాజు కథనం ప్రకారం... అనకాపల్లిలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం సమీపంలో ఉన్న లక్ష్మీ పేరడైజ్ అపార్టుమెంట్‌లో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొడవలి శివరామకృష్ణ (45) కుటుంబం 18 నెలల క్రితం అద్దెకు దిగింది. ఆయనకు భార్య మాధవి (38), కుమార్తెలు వైష్ణవి (14), జాహ్నవి (12), కుసుమ ప్రియ ఉన్నారు. సిటీ పబ్లిక్ స్కూల్‌లో వైష్ణవి తొమ్మిదో తరగతి, జాహ్నవి ఎనిమిదో తరగతి, కుసుమ ప్రియ మూడో తరగతి చదువుతున్నారు. గురువారం అర్ధరాత్రి తర్వాత కుసుమ ప్రియ పొరుగున ఉన్న వారిని లేపి తమ తల్లిదండ్రులు, అక్కలు అపస్మారక స్థితిలో ఉన్నట్టు తెలిపింది. దీంతో, వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూడగా అప్పటికే వారు మృతి చెందినట్లు గుర్తించారు. రాత్రి తెచ్చుకున్న స్వీట్లు, పలావుల్లో పాయిజన్ కలిపి తినడంతో వారంతా చనిపోయినట్టు నిర్ధారణకు వచ్చారు. కుసుమప్రియకు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. శివరామకృష్ణ అనకాపల్లిలో ఒక షాపును అద్దెకు తీసుకుని నగలు తయారు చేసేవారు. దేవాలయ విగ్రహాలకు వెండి కిరీటాలు, ఆభరణాలు చేయడంలో అందివేసిన చేయిగా స్థానిక బంగారు వర్తకులు చెబుతున్నారు. శివరామకృష్ణ తెనాలిలో ఉండగానే అప్పులు చేశారని, అప్పు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక విశాఖపట్నం వెళ్తున్నట్టు చెప్పి తన కుటుంబంతో అనకాపల్లి వచ్చారని ఆయన బంధువులు తెలిపారు. ఇక్కడ కూడా వెండి నగల కోసం ఆర్డర్లు ఇచ్చిన వారికి సకాలంలో ఇవ్వకపోవడం, అప్పులు చేయడంతో వారి నుంచి ఒత్తిడి పెరిగిందని, దీంతో, ఆత్మహత్య చేసుకుని ఉంటారని భావిస్తున్నామని చెప్పారు.

అమాత్యుల అసత్యాలు, అర్ధ సత్యాలు

గిరిపుత్ర

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో స్వల్ప వేతనాలతో బతుకులీడుస్తున్న అంగన్‌వాడీ, మున్సిపల్, గ్రామ/వార్డు సచివాలయ వాలంటీర్లు, సమగ్ర శిక్ష తదితర రంగాల్లోని చిరుద్యోగులు ఆందోళనబాట పట్టడంతో ఊపిరాడని సర్కారు అందులోంచి బయటపడడానికి అవాస్తవాలను ఆసరా చేసుకోవడం దారుణమైన విషయం. సాక్షాత్తూ రాష్ట్ర మంత్రులే అందుకు పూనుకోవడం వారి వ్యక్తిగత ప్రతిష్టకేగాక సర్కారుకూ మాయని మచ్చ. పాత్రికేయులకు నిజానిజాలు తెలుసు కనుక మంత్రులు వల్లెవేసే అవాస్తవాలను తమ వార్తలు, కథనాల్లో ప్రచురించకపోవడంతో ప్రజా ధనం వెచ్చించి కొన్ని దినపత్రికల్లో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ పేరిట వాణిజ్య ప్రకటనల ద్వారా అసత్యాలు, అర్ధ సత్యాలను ప్రభుత్వమే వండి వార్చడం అభ్యంతరకరం. సర్కారువారి అధికార పత్రికలో మాత్రం వాస్తవాలను వక్రీకరించి 'అంగన్‌వాడీలకు అడిగినవన్నీ...' అంటూ అవాస్తవాలతో కూడిన కథనాలను పుంఖానుపుంఖాలుగా వదలడం ఆశ్చర్యకరం కాదు. (ఆ పత్రికను నడుపుతున్నదే అందుకు కనుక!) నిజానికి ఇప్పుడు ఆందోళనకారుల ప్రధాన డిమాండ్లు నాటి ప్రతిపక్ష నేతగా ముఖ్యమంత్రి జగన్ చేసిన వాగ్దానాలను అమలు చేయాలనే! అలాగే ఈ దేశ సర్వోన్నత న్యాయస్థానం గ్రాట్యుటీ చెల్లింపు, సమాన పనికి సమాన వేతనం వంటివాటిని ప్రభుత్వం అమలు చేయాలని నొక్కి చెప్పింది. కాబట్టి ఇవి ఎంతమాత్రమూ గొంతెమ్మ కోర్కెలు కావు. నూటికి నూరు పాళ్లూ న్యాయమైనవి.

పెంచింది వెయ్యి రూపాయలే!

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం వచ్చిన నాటికి అంగన్‌వాడీల వేతనాలు వర్కర్‌కు రూ.10,500 మినీ వర్కర్‌కు, హెల్పర్‌కు రూ.6,000. ఈ ప్రభుత్వం కేవలం వెయ్యి రూపాయల చొప్పున మాత్రమే (జీవో 13 జూలై 2019) పెంచింది. వాస్తవం ఇదికాగా ఆ వాణిజ్య ప్రకటనలో వర్కర్ వేతనం రూ.7,000 నుండి అమాంతం రూ.11,500కు తమ సర్కారే పెంచినట్టు అర్థం వచ్చేలా అవాస్తవాలు పేర్కొంది. అక్కడితో ఆగకుండా అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వారి కుటుంబాలకు నగదు బదిలీ చేసినట్టు మరో కొండంత అబద్ధం చెప్పింది. అంగన్‌వాడీ వర్కర్ నెలకు రూ.11,500 చొప్పున ఏడాదికి రూ.1,38,000 సంపాదిస్తున్నారనీ, సంక్షేమ పథకాలకు ప్రాతిపదికయైన తెల్ల రేషన్ కార్డు (బిపిఎల్) వార్షికాదాయ పరిమితి రూ.1,20,000 కంటె ఇది ఎక్కువ కనుక ఆ కుటుంబానికి తెల్ల కార్డు కట్, సంక్షేమ పథకాలూ 2020లోనే నిర్దాక్షిణ్యంగా నిలిపివేశారు. ఈ నెల 21న మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ సైతం ఆయా పథకాలకు ఉన్న నిబంధనల ప్రకారం అమలు చేస్తారంటూ



వివరణ కూడా ఇచ్చివున్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్లకు నవరత్నాలు లేదా ఇతర నగదు బదిలీ పథకాలు అందడంలేదన్నది పచ్చి నిజం. డిసెంబర్ 12 నుండి సమ్మె జరుగుతుంటే అంగన్‌వాడీల డిమాండ్లు ముఖ్యమంత్రికి తెలియవని 26న జరిగిన చర్చల్లో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ చెప్పిన మాట నిజమని ఎవరైనా అనుకోగలరా?

పోలీసు సాయంతో పోటీ కార్మికులెందుకు?

మున్సిపల్ కార్మికులు తమ కష్టాలు వివరిస్తూ గత నాలుగేళ్లలో ప్రభుత్వానికి ఎన్నోమార్లు విన్నవించుకున్నా అవి పరిష్కారం కానందున తప్పనిసరియై డిసెంబర్ 26 నుండి నిరవధిక సమ్మెకు దిగారు. తీరికగా మూడవ రోజున చర్చలు జరిపిన మంత్రివర్యులు కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించడానికి బదులు అసత్యాల మూట విప్పి గురువారం రాత్రి మీడియాకు వినిపించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీల్లో 41 చోట్ల సమ్మె జరగడం లేదన్నారు. అంటే 82 పట్టణాల్లో సమ్మె జరుగుతోందని ఒప్పుకోవలసి వచ్చిందన్నమాట. వాస్తవానికి 105 పట్టణాల్లో సమ్మె విజయవంతంగా నడుస్తోంది. మొత్తం కార్మికుల్లో దాదాపు నాలుగింట మూడు వంతుల మందికి పైగా విధులకు వెళ్లడంలేదు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు పుట్టపర్తి, విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు తదితర చోట్ల పోలీసుల సహాయంతో పోటీ కార్మికుల్ని పనిలోకి దింపడానికి సర్కారు చేసిన కుయత్నాల్ని సమ్మెకారులు శాంతియుతంగానే తిప్పికొట్టారు. సమ్మె అంతగా జరగకపోతే పోలీసులకు ఈ డ్యూటీలు ఎందుకు వేసినట్టో అమాత్యులే సెలవివ్వాలి!

నిజంగానే నిధులు లేవా...?

ప్రభుత్వానికి చిరుద్యోగుల పట్ల ఎంతో సానుభూతి ఉందనీ, వారి డిమాండ్లు కూడా న్యాయమైనవేనని అంటూనే ఇవ్వాలనివున్నా నిధులు లేవని ప్రభుత్వ పెద్దలు సుతిమెత్తగా చెబుతున్నారు. ఇది నిజమా..? అయితే ప్రజల మాడు పగులగొట్టేలా ఇప్పటికే ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ తదితర పేర్లతో కరెంటు చార్జీలను పెంచిన సర్కారు తాజాగా 20 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసి స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు పెడతానంటోంది. ఆ నిధులెక్కడివి..? విద్యార్థులకిచ్చిన ట్యాబులు, వాటిలో నింపిన బైజూస్ కంటెంట్ కొనుగోలులో రూ.1,250 కోట్ల కుంభకోణం జరిగిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంటే అదానీ, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్, బైజూస్, ఏసర్ వంటి కార్పొరేట్లకు, కాంట్రాక్టర్లకూ సర్కారు బొక్కసాన్ని అప్పజెప్పడానికి ఎలాంటి ఆటంకాలూ లేవన్నమాట. పోలవరం, పులిచింతల తదితర ఇరిగేషన్ పనుల్లో జరుగుతున్న వ్యయం మీదా అనేక కథనాలు వస్తున్నాయి. తాజాగా గుండ్లకమ్మ గేటు కొట్టుకుపోవడం. ఇలా నిధులు గంగ పాలవుతుండగా చిరుద్యోగుల్ని, అసంఘటిత కార్మికుల్ని వీధుల పాల్జేయడం సర్కారుకు తగునా? ఈ ప్రభుత్వం ఎవరి పక్షం వహిస్తున్నట్టు?

బుజ్జగింపులు... బెదిరింపులు

'మీరంతా మావాళ్లు. మీకు వీలైనంత మంచి చేయాలన్నదే మా తపన...' అని అంగన్‌వాడీలకు తేనెలొలికే మాటలు చెప్పిన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ అదే పేరాలో 'ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాల్సిన పరిస్థితిని తీసుకురావద్దని...' హెచ్చరించడం కొస మెరుపు. సర్కారు ఒకవైపు బుజ్జగింపు మాటలు చెబుతూ బెదిరింపులకు పూనుకోవడం క్షంతవ్యం కాదు. నిజానికి ప్రత్యామ్నాయ చర్యలకు ప్రభుత్వం ఇప్పటికే తెగబడింది. 'పులి తన పిల్లలను తానే తింటుందన్న' సామెత మాదిరిగా ప్రభుత్వోద్యోగులతో పోలీసు పహరామధ్య ప్రభుత్వ ఆస్తి అయిన అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టించిన 'ఘనత' ఈ సర్కారుకే దక్కింది. అది కూడా కొన్ని చోట్ల అర్ధరాత్రి, అపరాత్రి వేళల్లో యత్నించడం సిగ్గుచేటు. అయినా అంగన్‌వాడీలు, వారికి మద్దతుగా లబ్ధిదార్లు, ఆయా నివాస ప్రాంతాల ప్రజలూ మద్దతుగా ఎదురుతిరగడంతో పాలకుల ఆటలు సాగలేదు. ఆందోళనకారులకు ఇంతలా ప్రజల మద్దతు లభించడం ఇటీవల కాలంలో ఎన్నడూ లేదు. అందుకే సమ్మెకారులకు సానుభూతితో ఉన్న ప్రజలకు అవాస్తవాలు చెప్పి తనవైపు మళ్లించుకోవడానికి సర్కారు ఇటువంటి కుయత్నాలకు పాల్పడుతోంది. ఈ కుట్రను అందరూ అర్థం చేసుకొని సమర్థవంతంగా సమైక్యంగా తిప్పికొట్టాలి. అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, గ్రామ/ వార్డు సచివాలయ వలంటీర్లు, సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న ఆందోళన న్యాయసమ్మతమైనది. వారి సమస్యలను పరిష్కరించి సమ్మెలు విరమింపజేయడం ప్రభుత్వ కర్తవ్యం. ఇప్పటికైనా సర్కారు ఆ దిశగా అడుగులు వేయాలి.



విజయవాడ అంగన్‌వాడీలకు సంఘీభావంగా ప్రదర్శన నిర్వహిస్తున్న జర్నలిస్టులు



కాకినాడలో అంగన్‌వాడీలకు మద్దతుగా శిబిరంలో కూర్చొన్న కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లం రాజు, ఎపి పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

అంగన్‌వాడీలకు విశాల మద్దతు

- కార్మిక, ప్రజా సంఘాలు, నేతల సంఘీభావం
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిన ఆందోళనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ 18 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు కార్మిక, ప్రజా సంఘాలు, నాయకులు మద్దతు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, వెంటనే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో అంగన్‌వాడీల నిరసనలు కొనసాగాయి.

అంగన్‌వాడీల సమ్మెకు విజయవాడలో జర్నలిస్టులు సంఘీభావం తెలిపారు. లెనిన్ సెంటర్ నుంచి ధర్నాచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు (ఎపిఎంపిఎ) రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్‌యాదవ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల ఉద్యమానికి తమ అసోసియేషన్ అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు చేస్తోన్న న్యాయమైన పోరాటానికి తమ పత్రిక అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీల సమస్యలు, ప్రభుత్వ వైఖరి, కేరళ తదితర రాష్ట్రాల్లో వారి కోసం అమలు చేస్తున్న పథకాలు, విధానాలపై తాము ఇటీవల తీసుకొచ్చిన ప్రత్యేక సంచిక గురించి వివరించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు, రాష్ట్ర నాయకులు ఒ.శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో సిఐటియు, ఎఐటియుసి, ఎఫ్ఐటియు, రైతు సంఘాల నాయకులు, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు కలెక్టరేట్ నుంచి ధర్నా చౌక్ వరకూ ర్యాలీగా వెళ్లి అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. నంద్యాలలో ఎంపి పోచాబ్రహ్మానందరెడ్డి ఇంటిని ముట్టడించారు. ఆయన లేకపోవడంతో ఇంటి గేటుకు వినతిపత్రం అంటించారు. శ్రీకాకుళంలో ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, యుటిఎఫ్, విఆర్ఎ నాయకులు మద్దతు తెలిపారు. ఇచ్ఛాపురం మండలంలోని పురుషోత్తపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిచేందుకు ప్రయత్నించిన సచివాలయ ఉద్యోగులను అంగన్‌వాడీలు, స్థానికులు అడ్డుకోవడంతో వారు వెనుదిరిగారు.

విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ ఇంటిని అంగన్‌వాడీలు ముట్టడించారు. బయటకు వచ్చిన ఎంపికి సమస్యలను విన్నవిస్తూ వినతిపత్రం అందజేశారు. అల్లూరి జిల్లా అరకులోయలో ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు, ఎస్ఎఫ్ఐ వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యాన అంగన్‌వాడీలకు మద్దతుగా ప్రదర్శన నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర మాట్లాడారు. హుకుంపేటలో పర్యటించిన రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను, వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డిలను అంగన్‌వాడీలు అడ్డుకుని సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

గుంటూరు జిల్లా తాడికొండలో మాజీ మంత్రి మేకతోటి సుచరితకు వినతి పత్రం ఇచ్చారు. పల్నాడు జిల్లాలో వినుకొండలో అంగన్‌వాడీలకు మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయలు మద్దతు తెలిపారు. వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లిన వారి పట్ల ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దురుసుగా ప్రవర్తించడాన్ని అంగన్‌వాడీలు ఖండించారు. హ్యూమన్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు మద్దతు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద, కాకినాడలో దీక్షా శిబిరానికి కేంద్ర మాజీ మంత్రి ఎంఎం.పల్లంరాజు, ఎపి పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలకు ప్రతిసారీ పెంచుతామనలేదు : బొత్స

'తాము అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం 2019లో అంగన్‌వాడీలకు రూ.1000 వేతనాలు పెంచాం. అంతేగానీ, తెలంగాణాలో అంగన్‌వాడీలకు పెంచిన ప్రతిసారీ ఇక్కడ కూడా పెంచుతామని హామీ ఇవ్వలేదు' అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయనగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణా మాదిరిగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామన్న వైసిపి ఎందుకు అమలు చేయలేకపోయిందని విలేకర్లు అడిగిన ప్రశ్నలకు ఆయన పై విధంగా స్పందించారు. వేతనాల పెంపు విషయంపై రెండు నెలలు గడువు కోరామని చెప్పారు. డిఎస్‌సి నోటిఫికేషన్‌పై చర్చిస్తున్నామని, రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముందని చెప్పారు.


భీమవరంలో పోలీసుల నిర్బంధంలో అంగన్‌వాడీలు

అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భీమవరం పర్యటన నేపథ్యంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులపై విరుచుకుపడ్డారు. ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండానే ముందస్తుగా రాత్రికి రాత్రి ఇళ్లకు వెళ్లి కొందరిని గృహ నిర్బంధం చేశారు. మరికొందరిని ఆయా పరిధిలోని పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లి నిర్బంధంలో ఉంచారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాంను ఏలూరులోని సిపిఎం కార్యాలయంలో నిర్బంధించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, సిపిఐ నాయకులు చెల్లబోయిన రంగారావులను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బంధంలో ఉంచారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ సిపిఎం నాయకులు జెఎన్‌వి గోపాలన్ స్టేషన్‌లోనే నిరాహార దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.విజయరామరాజు, జనసేన పార్టీ నాయకులు చెనమలశెట్టి చంద్రశేఖర్‌లను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. జిల్లాలో పలువురు నేతలను గృహనిర్బంధం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలను మున్సిపల్ కార్యాలయం వద్ద, సిఐటియు కార్యాలయం వద్ద దాదాపు 60 మందిని అరెస్ట్ చేసి సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. సంఘం నాయకులు సిహెచ్.మహాలక్ష్మి, విజయలక్ష్మి, కనకదుర్గలను గృహనిర్బంధం చేశారు. సిఎం పర్యటన అనంతరం వీరందరినీ విడిచిపెట్టారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు శాసనమండలి స్పీకర్ మోషేన్‌రాజు ద్వారా తమ సమస్యలపై సిఎంకు వినతిపత్రం అందించారు.

సిపిఎం ఖండన

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సిపిఎం, ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ అరెస్టులను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని కోరింది. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంలో సిపిఎం, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేయడం రాష్ట్రంలో పరిపాటిగా మారిందని పేర్కొంది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

తొలగించిన వలంటీర్లను వెంటనే తీసుకోవాలి

- సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వలంటీర్లు సమ్మె నోటీసిచ్చి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం వారిని తొలగిస్తూ నోటిసులిస్తోందని, తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గౌరవ వేతనం పేరుతో వలంటీర్లను ప్రభుత్వం దోపిడీ చేస్తోందన్నారు. వలంటీర్లు తమకు కనీస వేతనాలివ్వాలని, సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సమ్మె చేస్తున్నారని పేర్కొన్నారు. వలంటర్లీతో చర్చించి సమ్మె విరమింపజేయాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా తొలగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కనీస కోర్కెలను తీర్చాలని సమ్మె చేయడం ప్రభుత్వ విధానాలకు ఎలా వ్యతిరేకం అవుతుందని సిఐటియు నేతలు ప్రశ్నించారు.

రేపటి నుంచి సమ్మె ఉధృతం

- కార్మికులను రెచ్చగొట్టే విధానాలు ప్రభుత్వం మానుకోవాలి
- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెను ఈ నెల 31 నుంచి ఉధృతం చేస్తామని, మంచినీరు, కరెంటుతో సహా మొత్తం సేవలు బంద్ చేస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ప్రజలను తప్పుదారి పట్టించేలా కార్మికులను రెచ్చగొట్టే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమ్మె పెద్దగా జరగడం లేదని, తక్కువ మంది కార్మికులే పాల్గొంటున్నారని మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ గురువారం సంఘాలతో చర్చలు జరిపిన తరువాత మాట్లాడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 105 మున్సిపాల్టీల్లో సమ్మె జరుగుతుందని, 30 వేల మంది కార్మికులు పాల్గొన్నారని తెలిపారు. సమ్మె ప్రభావాన్ని తక్కువ చేసి మాట్లాడటం కార్మికులను అవమానించడమే అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ కవ్వింపు చర్యలు వెంటనే విడనాడాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను నాలుగున్నరేళ్లుగా అమలు చెయ్యకుండా మరలా ఎన్నికలకు సిద్ధపడటం సిగ్గుచేటని పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా, పుట్టపర్తి, ఒంగోలు, గుంటూరు జిల్లా తదితర చోట్ల పోటీ కార్మికులను తెచ్చి పోలీసుల అండతో పనిచేయించాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను అడ్డుకున్న కార్మికులపై పోలీసులు దౌర్జన్యం చేసి సమ్మెను నీరుగార్చాలని చేస్తున్న కుట్రలను విరమించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తేచ్చి కార్మిక హక్కులు కాపాడేందుకు కలిసి రావాలని సమ్మెకు దూరంగా ఉన్న సంఘాలకు విజ్ఞప్తి చేశారు. సుమారు 50 వేల కుటుంబాలకు అన్యాయం జరగకుండా చూడటంలో తమ వంతు పాత్రను పోషించాలని కోరారు.

లోకేష్‌కు సిఐడి నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రెడ్‌బుక్ పేరుతో అధికారులను టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బెదిరిస్తున్నారంటూ ఎపి సిఐడి కోర్టును ఆశ్రయించిన కేసులో లోకేష్‌కు శుక్రవారం సిఐడి నోటీసులు జారీ చేసింది. 41ఎ సెక్షన్‌ను నారా లోకేష్ ఉల్లంఘించారని, ఆయన్ను అరెస్టు చేసేందుకు అనుమతినివ్వాలని ఎసిబి కోర్టును సిఐడి ఆశ్రయించింది. ఈ కేసును ఎసిబి కోర్టు జనవరి 9కి వాయిదా వేసింది. కోర్టు ఆదేశాల మేరకు సిఐడి అధికారులు శుక్రవారం వాట్సాప్‌లో నోటీస్‌ను లోకేష్‌కు పంపారు. సిఐడి పంపిన నోటీసులను అందుకున్నట్లు సిఐడి అధికారులకు లోకేష్ సమాచారం అందజేశారు.


విజయవాడ ధర్నాచౌక్‌లో మాట్లాడుతున్న మధు


విశాఖలోని భీమిలిలో చెత్త తరలింపు వాహనాన్ని అడ్డుకున్న పారిశుధ్య కార్మికులు

సమ్మె విచ్ఛిన్నానికి పోటీ కార్మికులు

- అడ్డుకున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఉధృతరూపం దాల్చింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు తమ నిరసన గళం వినిపించారు. ఈ క్రమంలో సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా పోటీ కార్మికులను రంగంలోకి దించింది. వారిని సమ్మెలో ఉన్న కార్మికులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. విశాఖ జివిఎంసి అధికారులు పోటీ కార్మికులతో చెత్తను వాహనాల్లో తరలిస్తుండగా సమ్మెలో ఉన్న కార్మికులు భీమిలి రెల్లివీధిలో అడ్డుకున్నారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు జివిఎంసి అధికారులు చేసిన ప్రయత్నాలను పారిశుధ్య కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించాల్సిన ప్రభుత్వం తమను రెచ్చగొట్టే చర్యలకు దిగడం సరికాదన్నారు. విశాఖలోని జివిఎంసి జోన్ - 4 టౌన్ కొత్త రోడ్డు సూయజ్ ఫారం వద్ద మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు సందర్శించి మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ప్రభుత్వం సంగతి తేలుస్తామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, దాన్ని నెరవేర్చకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మెలోకి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు.

విజయవాడ రాణిగారితోటలో పోటీ కార్మికులను సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. ధర్నా చౌక్‌లో సమ్మెనుద్దేశించి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు చేస్తున్న న్యాయమైన ఆందోళనకు సిపిఎం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో మున్సిపల్ అధికారులు కొందరు కూలీలను వెంట తీసుకొచ్చి చెత్తను తొలగిస్తుండగా సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాట జరిగింది. సమస్యలు పరిష్కరించకుండా తమ పొట్టకొట్టే చర్యలకు పూనుకుంటారా? అని అధికారులపై మున్సిపల్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.గుంటూరు జిల్లా మంగళగిరి పరిధిలో పలు చోట్ల కార్మికులను అధికారులు బెదిరించారు. అధికారుల తీరును నిరసిస్తూ ఎంటిఎంసి కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళనకు దిగారు. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్‌టిఆర్, పల్నాడు, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మెడకు ఉరితాళ్లు బిగించుకొని, భిక్షాటనతో నిరసనలు తెలిపారు. పలుచోట్ల అర్ధనగ్న ప్రదర్శన చేశారు.

పుట్టపర్తిలో చిత్రావతి నదిలో జలదీక్ష చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు


'సమగ్ర' ఉద్యోగులను చర్చలకు పిలవాలి

- పలువురు వక్తల డిమాండ్
- పదవ రోజూ కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

విద్యాశాఖ మంత్రి, ఉన్నతాధికారులు స్పందించి జెఎసి నాయకులను చర్చలకు పిలిచి ఎస్ఎస్ఎ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారానికి పదవ రోజుకి చేరుకుంది. హెచ్‌ఆర్ పాలసీ ప్రకటించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో సమ్మె కొనసాగింది. భిక్షాటన చేస్తూ, మానవహారం, వంటావార్పు చేపట్టి, జాతీయ నాయకుల విగ్రహాల వద్ద వినతి పత్రాలు ఇస్తూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. ఎస్ఎస్ఎ అధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మెకు యుటిఎఫ్, జెవివి, ప్రజాసంఘాల నాయకులు, బిఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలులో ఎస్ఎస్ఎ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 16 వేల మందికిపైగా సర్వశిక్షలో పనిచేస్తున్నారని తెలిపారు. వారి డిమాండ్లకు పిడిఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని సమ్మె శిబిరాన్ని ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి సందర్శించి సంఘీభావం తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపికి ఎస్ఎస్ఎ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఒంగోలు జెఎసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెలో ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షులు శ్రావణ్ కుమార్ మాట్లాడారు. జనసేన పార్టీ రాష్ట్ర నాయకురాలు రాయపాటి అరుణ మద్దతు తెలిపారు.

రాజమహేంద్రవరంలో సమ్మెకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి మద్దతు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఎస్ఎస్ఎ ఉద్యోగులు వినూత్న నిరసన చేపట్టారు. ఆర్‌డిఒ కార్యాలయం నుంచి చిత్రావతి హారతి ఘాట్ వరకు ర్యాలీ చేపట్టి చిత్రావతి నదిలో జలదీక్ష చేపట్టారు. అనంతరపురం, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లా, ఉమ్మడి చిత్తూరు, బాపట్ల, నెల్లూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, కాకినాడ, విశాఖ, విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో సమ్మె కొనసాగింది.

నాటక రంగానికి ప్రోత్సాహం


వైఎస్ఆర్ పురస్కారాన్ని అందుకుంటున్న కాకినాడ యంగ్‌మెన్స్ అసోసియేషన్ నిర్వాహకులు

- బహుమతుల ప్రదానోత్సవంలో మంత్రి అంబటి
- ముగిసిన నంది నాటకోత్సవాలు
- ఎన్‌టిఆర్, వైఎస్ఆర్ పురస్కారాల అందజేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సమాజానికి ప్రాణప్రధానమైన నాటక రంగాన్ని, నాటకరంగ కళాకారులను ప్రోత్సహించేందుకు నంది నాటకోత్సవాలను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు జరిగిన నందినాటకోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేశారు. మంత్రి అంబటి మాట్లాడుతూ టివి, సినిమా కళాకారులు ఎంతో కొంత సంపాదిస్తారని, నాటక రంగంలోని కళాకారులు సంపాదించినదానికంటే కోల్పోయిందే ఎక్కువని అన్నారు. ఇటువంటి కళాకారులను ఆదుకోడానికి నాటక రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. 2022-23 సంవత్సరానికి 'ఎన్‌టిఆర్ రంగస్థల' అవార్డును విశాఖపట్నంకు చెందిన ప్రముఖ రంగస్థల నటులు, రచయిత డాక్టర్ మీగడ రామలింగస్వామికి మంత్రి ప్రదానం చేశారు. గజమాలతో సన్మానించి జ్ఞాపిక, రూ.1.50 లక్షల చెక్కు అందించారు. 'డాక్టర్ వైఎస్ఆర్ అవార్డు'ను కాకినాడకు చెందిన యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ప్రతినిధులను సత్కరించి జ్ఞాపిక, రూ.5 లక్షల చెక్కును అందజేశారు. సీనియర్ నాటక కళాకారులు కెఎస్‌కె సాయిని ఈ సందర్భంగా సత్కరించారు. నంది నాటకోత్సవాల తుది పోటీలకు సంబంధించి 38 ప్రదర్శనలు జరిగాయి. ఉత్తమ ప్రదర్శనలుగా పద్య నాటకాలు- మాధవ వర్మ, శ్రీకాంత కష్ణమాచార్య, వసంత రాజీయం, సాంఘిక నాటకాలు- ఇంద్రప్రస్తం, ద ఇంపోస్టర్స్, కలనేత, సాంఘిక నాటికలు - ఆస్థికలు, కమనీయం, చీకటి పువ్వు, బాలల నాటికలు - ప్రపంచ తంత్రం, బాధ్యత, మూడు ప్రశ్నలు, యూనివర్సిటీ/కాలేజి నాటికలలో 'ఇంకానా', కపిరాజు, ఉద్దం సింగ్ ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిసి చైర్మన్ పోసాని కృష్ణ మురళీ, మేనేజింగ్ డైరక్టర్ తమ్మా విజయ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకుంటామని సిఐటియు అక్కయ్యపాలెం జోన్ నాయకులు జి అప్పలరాజు, యుఎస్ఎన్ రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1002వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు అక్కయ్యపాలెం జోన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ రూ. కోట్ల విలువైన, లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయడం దుర్మార్గమన్నారు. ఉక్కు కర్మాగారం వల్లే విశాఖ ఇంతలా అభివృద్ధి చెందిందని తెలిపారు. త్యాగాలతో ఏర్పడిన ప్లాంట్‌కు మరింత ఊతమిచ్చి, సొంత గనులు కేటాయించాల్సిందిపోయి నిర్వీర్యం చేసేలా మోడీ సర్కారు నిర్ణయాలు తీసుకోవడం శోచనీయమన్నారు. ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయం నుంచి వెనక్కు తగ్గకుంటే రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దీక్షల్లో నాయకులు రాము, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల పాలిట యమపాశం సెక్షన్ 106

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇటీవల కేంద్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలకు సంబంధించి తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత 2023 సెక్షన్ 106 డ్రైవర్ల పాలిట శాపం అవుతుందని ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు రోడ్డు ప్రమాదాలకు చెందిన చట్ట సవరణను నిలిపి వేయాలని లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్డు ప్రమాదాల్లో డ్రైవర్ల తప్పులుంటే ఇప్పుడున్న శిక్షలు సరిపోతాయని తెలిపారు. ఈ శిక్షలను భారీగా పెంచడం వల్ల డ్రైవర్లుగా పనిచేసేందుకు ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి వుండదన్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో డ్రైవర్ల కొరతతో రవాణా రంగం ఇబ్బందులు పడుతోందని అన్నారు.

హయ్యర్ పెన్షన్‌కు ఉద్యోగి నుండి వాటా తీసుకోండి

ఎన్ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో 58 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఇపిఎఫ్ హయ్యర్ పెన్షన్ స్కీమ్ అమలులో ఉద్యోగి నుంచి వాటా తీసుకుని 10డి ఫారాలను సంస్థ నుంచి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఏపిపిటిడి ఎన్ఎంయు కోరింది. ఈ మేరకు ఏపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఆర్‌టిసి ఉద్యోగులందరికీ ఇపిఎఫ్ హయ్యర్ పెన్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగుల కుటుంబ సభ్యులందరికీ ఫ్రీ పాసులు ఇవ్వాలి : ఇయు

ఏపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగుల కుటుంబ సభ్యులందరికీ ఇప్పటి వరకూ ఆల్ట్రా డీలక్స్ బస్సుల వరకు మాత్రమే ఉచిత ప్రయాణానికి అనుమతి ఇస్తున్నారు. సూపర్ డీలక్స్ బస్సుల్లో కూడా ఉచితంగా అనుమతించాలని ఎంప్లాయిస్ యూనియన్ కోరింది. ఈ మేరకు ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య వినతిపత్రం అందజేశారు. ఎసి బస్సుల్లో 50 శాతం రాయితీతో అనుమతించాలని కోరారు.


మహాసభలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ అఖిలభారత అధ్యక్షుడు సాను


జెఎన్‌యుఎస్‌యు అధ్యక్షురాలు ఐషీఘోష్


ఎస్‌ఎఫ్‌ఐ అఖిలభారత మాజీ అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు


నాగరాజు, ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి


అనిల్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి


రామన్న డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి

విద్యారంగ పరిరక్షణకు ఐక్య పోరాటం

ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను

ప్రజాశక్తి - అల్లూరి సీతారామరాజు నగర్ నుంచి ప్రత్యేక ప్రతినిధి

దేశంలో విద్యా రంగ పరిరక్షణకు ఐక్య పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షులు వి.పి.సాను అన్నారు. కాకినాడలోని అల్లూరి సీతారామరాజు నగర్ (అంబేద్కర్ భవన్)లో శుక్రవారం జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ 24వ రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడారు. చరిత్రను మార్చి రాసేందుకు మోడీ సర్కార్ పూనుకోవడంతో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, అల్లూరి, కందుకూరి వంటి మహనీయుల గురుంచి కూడా తెలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి నుంచి దేశాన్ని కాపాడాలని, విద్యా రంగాన్ని పరిరక్షించాలని, అందుకోసం జనవరి 12న చలో ఢిల్లీ ఆందోళన నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రమాదంలో విద్యా రంగం : ఐషీఘోష్

దేశంలో విద్యారంగం ప్రమాదంలో ఉందని, దీనికి వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి పోరాటం చేయాలని జెఎన్‌యుఎస్‌యు అధ్యక్షురాలు ఐషీఘోష్ కోరారు. సమాజం ప్రమాదంలో ఉన్నప్పుడు విద్యార్థులు, యువత ముందుండి పోరాడాలని భగత్‌సింగ్ పిలుపునిచ్చారన్నారు. ఇప్పుడు సమాజం ప్రమాదంలో పడిందని, భగత్‌సింగ్ వారసత్వాన్ని అందిపుచ్చుకొని పోరాటాలను నిర్మించాలన్నారు.

రాజీ లేని పోరాటాలు సాగించాలి : వై. వెంకటేశ్వరరావు

రాష్ట్ర మహాసభ స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని రాజీలేని పోరాటాలు సాగించాలని ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సంక్షేమ వసతి గృహాల్లో నేటికీ అనేక సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని, ప్రయివేటు కళాశాలల్లో ఫీజుల భారం ఎక్కువగా ఉందని వీటిపై పోరాటం చేయాలని కోరారు.

నేతల సౌహార్ద సందేశాలు

అల్లూరి స్ఫూర్తితో పోరాటాలు చేయాలని, ఉద్యమాలకు ప్రజానాట్యమండలి బాసటగా ఉంటుందని పలువురు నేతలు సౌహార్ద సందేశాలు ఇచ్చారు. తెలంగాణ ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో రానున్న రోజుల్లో పోరాటాలను మరింత ఉధృతం చేయాలని కోరారు. విద్యార్థి ఉద్యమాలపై కేంద్ర ప్రభుత్వం నిర్బంధాలను ప్రయోగిస్తోందని, ఆంధ్ర ప్రదేశ్‌లో వైసిపి ప్రభుత్వం కూడా అదే వైఖరితో ఉందన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. విద్యారంగ రక్షణ కోసం ఎస్‌ఎఫ్‌ఐ నిర్వహిస్తున్న ఉద్యమాలకు ప్రజానాట్యమండలి ఆటలు, పాటలు బాసటగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. బలమైన విద్యార్థి ఉద్యమం నిర్మించడానికి సాంస్కృతిక రంగం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా వ్యవస్థను ధ్వంసం చేసే కార్పొరేట్ల ధన దాహం తీర్చేందుకు సహకరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ చేయి కలుపుదామని పిలుపునిచ్చారు.


సుకన్య సమృద్ధిపై స్వల్పంగా వడ్డీ పెంపు

న్యూఢిల్లీ : బాలికలకు చెందిన పొదుపు పథకం సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకంపై కేంద్రం ఎట్టకేలకు స్వల్పంగా వడ్డీ రేట్లను పెంచింది. చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను ఆర్థిక శాఖ సవరించింది. ప్రతీ త్రైమాసికానికి ఓ సారి వడ్డీ రేట్లను సమీక్షించే విషయం తెలిసిందే. సుకన్య సమృద్ధి యోజన, మూడేళ్ల కాలవ్యవధి కలిగిన పోస్టాఫీసు టైమ్ డిపాజిట్‌లపై మాత్రమే వడ్డీ రేట్లను పెంచింది. ఎస్ఎస్‌వైపై ప్రస్తుతం ఉన్న 8 శాతం వడ్డీ రేటును 20 బేసిస్ పాయింట్లు పెంచి 8.2 శాతానికి చేర్చింది. పోస్టాఫీసు మూడేళ్ల టైమ్ డిపాజిట్‌పై 7 శాతంగా ఉన్న వడ్డీని 7.1 శాతానికి చేర్చింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి మార్చి 31 వరకు ఈ వడ్డీ రేట్లు వర్తించనున్నాయి. మిగిలిన పథకాలపై వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. అదే విధంగా పిపిఎఫ్‌పై 7.1 శాతం, సీనియర్ సిటిజన్ స్కీమ్ 8.2 శాతం, మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ 7.4 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ 7.7 శాతం, కిసాన్ వికాస్ పత్ర వడ్డీ రేట్లు 7.5 శాతం చొప్పున వడ్డీ రేట్లు ఇంతక్రితం స్థాయిల్లోనే అమల్లో ఉండనున్నాయి.

క్లియర్ ప్రీమియం చేతికి కెల్జాయ్ వోల్కానిక్..!

హైదరాబాద్ : కెల్జాయ్ వోల్కానిక్ వాటర్‌లో మెజారిటీ వాటాను తీసుకుంటున్నట్లు క్లియర్ ప్రీమియం వాటర్ ప్రకటించింది. అగ్ని పర్వాతాల బుగ్గల నుంచి సేకరించిన విలక్షణ సహజ ఖనిజ జలాలకు కెల్జాయ్ వోల్కానిక్ వాటర్ ప్రసిద్ధి చెందింది. ఈ కొనుగోలు తమ సంస్థకు ముఖ్యమైన మైలురాయిని అని క్లియర్ ప్రీమియం పేర్కొంది. ఇది తమ ఉత్పత్తి పోర్టుఫోలియోను విస్తరించడానికి, బాటిల్డ్ వాటర్ పరిశ్రమలో ఆవిష్కరణకు మార్గదర్శకంగా నిలువనుందని తెలిపింది. దీంతో తమ మార్కెట్ ఉనికి పెరగనుందని క్లియర్ ప్రీమియం వాటర్ వ్యవస్థాపకుడు, సిఇఒ నయన్ షా పేర్కొన్నారు.

3న టెక్నో పాప్8 స్మార్ట్‌ఫోన్ విడుదల



న్యూఢిల్లీ : టెక్నో తన స్మార్ట్‌ఫోన్ పోర్టుఫోలియోను విస్తరిస్తోంది. జనవరి 3న టెక్నో పాప్8 స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఇది మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తి అని తెలిపింది. 84జిబి ర్యామ్, 64జిబి ఇంటర్నల్ స్టోరేజీతో దీన్ని అందుబాటులోకి తెస్తోంది. 6.56 అంగుళాల పాండ స్క్రీన్ ప్రొటెక్షన్, 5000 ఎంఎహెచ్ బ్యాటరీతో దీన్ని విడుదల చేస్తుంది.

సంపాదకీయం


రుణ భారతం

భారత స్థూల జాతీయోత్పత్తి (జిడిపి), రుణాలకు సంబంధించిన నిష్పత్తి ప్రమాదకర స్థితిలో ఉందంటూ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) నివేదించడం ఆందోళన కలిగిస్తోంది. భారత ఆర్థిక పునాది బీటలు వారుతోందని ఐఎంఎఫ్ వ్యాఖ్యానించిందంటే బిజెపి ప్రభుత్వం సాధించిన ప్రగతి ఏమిటో ఇట్టే అర్థమవుతుంది. దేశ స్థూల జాతీయోత్పత్తిలో ప్రస్తుతం రుణాల నిష్పత్తి 82.4 శాతంగా ఉందని ఐఎంఎఫ్ నివేదించింది. జిడిపిలో 80 శాతానికి పైగా రుణ భారం ఉండటమనేది ఆర్థిక పరిభాషలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిగా పరిగణిస్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెబుతున్నట్లుగా దేశం ఆర్థికంగా అభివద్ధి చెందుతున్నట్లయితే ...ఆ మేరకు జిడిపిలో రుణ నిష్పత్తి కూడా తగ్గాలి. కానీ అది వ్యతిరేక దిశలో ఉంది. వాస్తవానికి 2018 నుంచి అప్పులు పెరిగాయి. 2019 చివరి నాటికి, స్థూల దేశీయోత్పత్తి - రుణాల నిష్పత్తి 74 శాతంగా ఉంది. ప్రస్తుతం అది 82.4 శాతానికి ఎగబాకింది. కేంద్ర ప్రభుత్వం అందించిన అధికారిక సమాచారం ఆధారంగానే ఐఎంఎఫ్ నివేదికలు రూపొందిస్తుంది. అంటే దేశాభివృద్ధి అంతా డొల్ల అని, తిరోగమన దిశలో పతనమవుతోందన్న విషయాన్ని మోడీ సర్కార్ గణాంకాలే నిగ్గుతేల్చుతున్నాయి. గత రెండేళ్లలో రుణాలు, జిడిపి నిష్పత్తి శాతం 88 నుంచి 81కి తగ్గిందని కేంద్రం నిస్సిగ్గుగా బుకాయిస్తోంది. పైగా రానున్న రెండేళ్లలో ద్రవ్యోల్బణాన్ని 4.5 శాతానికి తగ్గిస్తామంటూ గాల్లో మేడలు కడుతుండటం సిగ్గుచేటు.

జీవనోపాధులు క్షీణించడం, ఆహార ద్రవ్యోల్బణం ఎగబాకడం, రుణభారాల మోత సహజంగానే అంతర్జాతీయంగా భారత ద్రవ్య పరపతిని కుదించివేస్తాయి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చేనాటికి దేశ అప్పు రూ.55.87 లక్షల కోట్లుగా ఉండగా అది ఈ ఏడాది మార్చి నాటికి 155.31 లక్షల కోట్లుకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 169.46 లక్షల కోట్లకు చేరనున్నట్లు బడ్జెట్ అంచనాల్లో కేంద్రమే పేర్కొంది. గణాంకాల్లో పేర్కొనని అప్పు మరో రూ.1.2 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. ఒకవైపు రుణాల ఊబిలో నిండా మునిగిన మోడీ సర్కార్ మరోవైపు రాష్ట్రాలు ఆర్థిక క్రమ శిక్షణ పాటించాలంటూ నీతులు చెబుతుండటం దాని ద్వంద్వనీతికి నిదర్శనం. ప్రధానంగా బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రుణాలకు ఆంక్షలు విధిస్తూ అభివృద్ధికి మోకాలడ్డుతోంది. వేలాది కోట్ల రూపాయల సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న కేంద్రం..రాష్ట్రాల్లో పేదలకు అమల్జేస్తున్న సంక్షేమ పథకాలకు 'ఉచితాలు' ముద్ర వేస్తూ అడ్డుకునేందుకు ఈ రుణ షరతులు విధిస్తోంది. వాస్తవానికి కేంద్రంతో పోలిస్తే రాష్ట్రాల్లో రుణాలు, ఎస్‌జిడిపి నిష్పత్తి శాతం చాలా తక్కువ. కేరళలో ఇది 36 శాతం మాత్రమే. కోవిడ్ కాలంలో కేరళ అప్పుల భారం 39 శాతానికి చేరినా అక్కడి వామపక్ష ప్రభుత్వం స్వల్ప వ్యవధిలోనే అత్యల్ప స్థాయికి తీసుకొచ్చింది. కేరళ ఆర్థిక వృద్ధిని, అప్పుల భారాన్ని పోల్చి చూస్తే..ఆర్థిక క్రమశిక్షణకు ఆదర్శంగా నిలుస్తోంది.

వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) కారణంగా కేంద్రం పన్నుల వసూళ్లు భారీగా పెరిగినప్పటికీ మోడీ సర్కార్ ఏలుబడిలో ద్రవ్యలోటు విపరీతంగా పెరిగిపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ద్రవ్యలోటు 6 శాతానికి మించి నమోదు కానుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ ఇదివరకే హెచ్చరించింది కూడా. కానీ రెండేళ్లలో దీనిని 4.5 శాతానికి కుదిస్తామన్న మోడీ సర్కార్ ఈ దఫా బడ్జెట్ లక్ష్యంగా 5.9 శాతానికి కుదిస్తామని నమ్మబలుకుతోంది. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని, రెవెన్యూ లోటును తగ్గించుకొని ద్రవ్యలోటును 3 శాతానికి పరిమితమయ్యేలా చూడాలని 2003లో తీసుకొచ్చిన ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్‌ఆర్‌బిఎం యాక్టు) నిర్దేశిస్తోంది. ఈ నిబంధనలను పాటించని బిజెపి సర్కార్ కేరళ వంటి రాష్ట్రాలకు మాత్రం షరతులను విధిస్తూ రుణాలకు అనుమతిని నిరాకరించడం ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాలపై కక్ష సాధించడం మినహా మరొకటి కాదు. రుణ మంజూరును అడ్డుకోవడం ద్వారా రాష్ట్రాలను తమ కీలుబొమ్మలుగా మలుచుకోవాలన్నది మోడీ సర్కార్ పన్నాగం. సమాఖ్య స్ఫూర్తిని నీరుగార్చే ఇలాంటి దుర్మార్గ చర్యలను అడ్డుకోవాలి.

మహనీయుల మాట



వంద పూలు
వికసించనీయండి,
వేల ఆలోచనలు
సంఘర్షించనీయండి.

-మావో

లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపి జిమ్మిక్కులు

విశ్లేషణ



ఎస్. వినయ కుమార్

లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపి చేస్తున్న విన్యాసంలో భాగంగా అయోధ్యలో జనవరి 22న ఆకాశమంత పందిరి వేసి భూదేవి అంత అరుగు వేసి అన్నంత ఆర్భాటంగా శ్రీరామ మూర్తికి "ప్రాణ ప్రతిష్ట" జరగనుంది. ఆ కార్యక్రమానికి తాము వెళ్లడం లేదని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి ప్రకటించారు. మతం వ్యక్తిగతం.మత కార్యక్రమాలకు ప్రభుత్వం దూరంగా ఉండాలని ఆయన చెప్పారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ కూడా మతాన్ని ప్రభుత్వాన్ని కలగాపులగం చేయడాన్ని వ్యతిరేకించారు. ప్రతి ఎన్నికలకు ముందు బిజెపి మతం కార్డును ప్రయోగిస్తోందన్నారామె. నిర్దిష్టంగా చెప్పకపోయినా, ప్రకటన ఆమె వెళ్లడం లేదనే ధ్వనిస్తోంది. ఆహ్వానం అందుకున్న మిగతా పార్టీలు, వాటి నాయకులు ఏమి చేస్తారో చూడాలి. ఈ సందర్భంగా ఒక విషయం గుర్తు చేసుకోవడం అవసరం. గుజరాత్‌లోని సోమనాథ్ మందిరం మరమ్మతుల తర్వాత తిరిగి ప్రారంభించే కార్యక్రమానికి తాను అధికార హోదాలో వెళ్లాలని అప్పటి రాష్ట్రపతి డా.రాజేంద్ర ప్రసాద్ భావించారు. కాని అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆయన కోరికను నిరాకరించారు. ఒక మతానికి చెందిన కార్యక్రమంలో అధికారికంగా రాష్ట్రపతి వెళ్లడం కుదరదని స్పష్టం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ఏమి చేయనుందో? రాజ్యాంగం బోధించే లౌకిక విలువలను తన రాజకీయాల కోసం ధ్వంసం చేస్తున్న ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం "ప్రాణ ప్రతిష్ట" కార్యక్రమానికి అట్టహాసంగా బయలుదేరనున్నారు. ఆయనతోపాటు ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ కూడా ఆ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

మతపరంగా భారతీయులను విభజించి పాలించడానికి బ్రిటిష్ పాలకులు రగిల్చిన మత విద్వేషాల మంట ఇంకా మండుతూనే ఉంది. ఎంతోమంది భారతీయులు ఆ మంటకు బలయ్యారు. అవుతూనే ఉన్నారు. అయినా ఆ మంట ఆరిపోకుండా మతతత్వ రాజకీయ పార్టీలు, సంస్థలు ఎగదోస్తూనే ఉన్నాయి. ముస్లింలపై, క్రైస్తవులపై లౌకిక ప్రజాస్వామ్య వాదులపై దాడులు జరుగుతున్నాయి. అవి భౌతిక దాడులు కావచ్చు. లేదా డీప్ ఫేక్ దాడులూ కావచ్చు. ముస్లిం మతోన్మాద పార్టీలు, సంస్థలు అదే పని చేస్తున్నాయి.

ప్రధానితో పాటు పదివేల మంది ప్రముఖులు 'ప్రాణ ప్రతిష్ట'లో పాల్గొననున్నట్లు అయోధ్య ట్రస్టు వెల్లడించింది. వారితో పాటు ప్రభుత్వ సిబ్బంది కోసం అయోధ్య పట్టణంలోని హోటళ్ల రూములను, సత్రాలను బుక్ చేస్తున్నారు ఇప్పటికే చేసుకొన్న బుకింగ్‌లను యూపీ పభుత్వం రద్దు చేసింది. జనవరి 22న ట్రస్టు నుండి ఆహ్వానం అందుకొన్న వారు, విధులు నిర్వహణకు నియమించిన ప్రభుత్వ సిబ్బందిని మాత్రమే అయోధ్య పట్టణంలోకి అనుమతిస్తారు. వారు తమ ఆహ్వాన పత్రాలను, అధికారిక ఉత్తర్వులను చూపెట్టాలి. అయోధ్యలో కొత్తగా ప్రారంభమైన విమానాశ్రయంలోకి దేశం నలుమూలల నుండి వంద విమానాలు ఆరోజు వాలుతాయట.

దేశ వ్యాప్తంగా ఐదు లక్షల గ్రామాల్లో జనవరి 1నుండి 15వ తేదీ వరకు తాత్కాలిక రామ విగ్రహం ముందు ఉంచి పూజించిన అక్షింతలను పంచుతారట. మందిర నిర్మాణానికి 2020 ఫిబ్రవరి నుండి 2023 మార్చి 31 వరకు రూ.90 కోట్లు ఖర్చుచేసినట్లు, అవి పోగా మరో 3వేల కోట్లు తమ దగ్గర నిల్వ ఉన్నట్లు ట్రస్టు వెల్లడించింది. రామమందిర నిర్మాణంలో ఇది రెండో దశ మాత్రమే. మందిర నిర్మాణం 2025 జనవరి నాటికల్లా పూర్తవుతుందట. నిర్మాణం పూర్తి కాకుండానే ఇంత తొందరెందుకంటే రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం అన్నది స్పష్టం.

తాత్కాలిక గుడిలో భక్తులు సమర్పించుకొంటున్న కానుకలు రోజురోజుకి పెరిగిపోతూనే ఉన్నాయి. సెప్టెంబర్ నెలలో అక్కడి దానపాత్ర(హుండీ) ఆదాయం రూ.60లక్షలు కాగా అక్టోబర్‌లో రూ.64లక్షలు. ఆ రాబడి నెలకు కోటి రూపాయల వరకు పెరగొచ్చని ట్రస్టు అంచనా. మొదట్లో నెలకు రూ.10లక్షలు రూ.15లక్షలు మాత్రమే హుండీ ఆదాయం ఉండేది. విదేశీ విరాళాల కోసం కూడా కేంద్ర ప్రభుత్వం అయోధ్య ట్రస్టును విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్‌ఎ) కింద రిజిస్టర్ చేసింది. అయితే దాని బ్యాంక్ అకౌంట్ ఢిల్లీలో ఉంది కనుక అందులో ఎంత డబ్బు పడిందో తమకు ఇంకా తెలియదని ట్రస్టు ప్రతినిధి అయోధ్యలో చెప్పారు. 2021 జనవరి 15నుండి 44 రోజుల పాటు దేశమంతటా విరాళాల సేకరణ కోసం శ్రీరామ జన్మభూమి రామ మందిర నిధి సమర్పణ్ అభియాన్‌ను ప్రారంభించారు. రామమందిర నిర్మాణానికి రూ.18వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా. అవి కాకుండా లెక్కకురాని ఖర్చులు కూడా ఉంటాయి. ఈ ఏడాది ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మందిర నిర్మాణానికి రూ.500 కోట్లు బడ్జెట్ నుండి కేటాయించింది. అయోధ్య పర్యాటక స్థలంగా మారనుంది.కనుక మరో రూ.95 కోట్లు తులసి స్మారక భవనం పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం కేటాయించింది.

తామొకటి తలిస్తే దైవమొక్కటి తలిచాడు అన్నట్లు అయోధ్య పట్టణంలో చిన్న వ్యాపారులు ఒకటనుకొంటే మోడీ, యోగీలు మరొకటి చేస్తున్నారు. 1980లో భారతీయ జనతా పార్టీ ప్రారంభమైన నాటినుండి అక్కడి వ్యాపారులు బిజెపి మద్దతుదారులు. అయోధ్యలో రామమందిరం నిర్మించాలని పట్టుదలతో ఉన్నారు. బాబ్రీ మసీదు విధ్వంసంలో కరసేవకులకు సహకరించారు కూడా. 2020 ఆగస్టు 5న మోడీ మందిర నిర్మాణానికి పునాదిరాయి వేయడంతో వారు ఉప్పొంగిపోయారు. కాని ఆ రాయి తమకే వచ్చి బలంగా తగులుతుందని ఊహించలేని అమాయకులు. వారణాసిలో రోడ్లు వెడల్పు చేసి "కాశీ విశ్వనాథ్ కారిడార్" ను నిర్మించిన తరహాలో అయోధ్య పట్టణంలోనూ రోడ్లు వెడల్పు చేస్తున్నారు. పట్టణంలో 13 కి.మీల ట్రంకు రోడ్డు నిర్మాణానికి రూ.797.68కోట్లు యూపీ ప్రభుత్వం కేటాయించింది. ఈ పనిని రెండేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించింది. రోడ్డు వెడల్పు చిన్న వ్యాపారుల నోటికాడి ముద్దను లాగేసుకొంది. పట్టణంలో బుల్‌డోజర్ల రొద నిర్విరామంగా వినిపిస్తోంది. ఆ రొద విన్పిస్తే చాలు చిన్న వ్యాపారుల పైప్రాణాలు పైనే పోతున్నాయి. అంగళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని యోగి ఏడాది క్రితం ప్రకటించారు. కాని ఆ న్యాయం దరిదాపుల్లో కన్పించడం లేదు. రాజ్‌కుమార్ సైని అనే అతను 30ఏళ్లుగా హనుమాన్ గృహ గుడి ముందు చిన్న అంగడిలో పూలు అమ్మేవాడు. రోడ్డు వెడల్పులో ఆ షాపును కూల్చేశారు. ఇప్పుడు రోడ్డుమీద సైని పూలు అమ్ముతున్నాడు. అతని రోజువారి ఆదాయం దాదాపు మూడింట ఒక వంతుకు పడిపోయింది. కుటుంబం కష్టాల పాలైంది.

రోడ్డు వెడల్పులో బ్రిజ్ కిషోర్ పాండే అంగడి, ఇల్లూ రెండూ పోయాయి. ప్రభుత్వం తమ దుస్థితిని గమనిస్తోందో లేదో అర్థం కావడంలేదని పాండే చెప్పారు. మూడు తరాలుగా మేము మా అంగడిలో పూజా సామగ్రి అమ్మేవారం. మోడీజీకి, యోగీజీకి మద్దతు ఇస్తూ వచ్చాం. కాని బుల్‌డోజర్ నా ఇంటి ముందుకే యోగి వస్తుందని నేను ఎప్పుడూ ఊహించలేదని వాపోయాడు. అంగడిని, ఇంటిని కూల్చి రెండు నెలలయింది. ప్రభుత్వం నుండి అందిన నష్టపరిహారం లక్ష రూపాయలు మాత్రమే. ప్రధానమంత్రి ముద్ర యోజన కింద వ్యాపారం కోసం నాలుగేళ్ల క్రితం అతను అప్పు తీసుకొన్నాడు. ప్రతి నెలా వాయిదా డబ్బు కడుతున్నాడు. అప్పు ఇంకా ఉంది. అది ఎలా తీర్చాలని బ్రిజ్ బేలగా ప్రశ్నించారు. మా సమస్యల్ని ప్రభుత్వం ఎలా పరిష్కరించనుందో అర్థం కావడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీకాంత్ తివారి తన షాపులో మత సంబంధమైన పుస్తకాలు అమ్మేవాడు. విస్తరణలో అతని అంగడిలో కొద్ది భాగమే మిగిలింది. ఇప్పుడు పుస్తకాల వ్యాపారం మానేసి పొగాకు వ్యాపారం చేస్తున్నాడు. ప్రతిరోజు రూ. వెయ్యి నుండి రూ.1500 వరకు అతనికి ఆదాయం ఉండేది. ఇప్పుడు ఆ ఆదాయం పోయింది. ఇలాగే ఉంటే మేము బిచ్చమెత్తుకొని బతకాల్సిందేనని ఆయన అన్నారు. గతంలో వ్యాపారులు షాపు యజమానుల 25 శాతం అద్దె పెంపుతో ఐదేళ్లకు ఒప్పందం తిరిగి రాసుకొనేవారు. ఇప్పుడు ఐదేళ్లకు బదులు 11 నెలల లీజు ఒప్పందమే చేసుకొంటామని షాపు యజమానులు భీష్మించారు. అంటే ప్రతి 11 నెలలకు అద్దె పెంచుతారన్న మాట. తమ షరతులపై ఒప్పందం పునరుద్ధరించుకో వారిపై ట్రెస్ పాసర్ కింద వివిధ సెక్షన్లు మోపి కేసులు పెడ్తున్నారు. ముప్పయి నలబై ఏళ్ల క్రితం తమ పేరుపై అంగడిని లీజుకు తీసుకొన్న వృద్ధతరం నేడు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.


బ్రిటిష్ కాలంలోనే బాబ్రీ మసీదుపై వివాదాలు మొదలయ్యాయి. 1853లో నిర్మోహీ అనే హిందూ తెగ బాబర్ గుడిని కూల్చి మసీదు నిర్మించాడని వాదించింది. ఆ సమయంలో మొదటిసారిగా అక్కడ మత ఘర్షణలు జరిగాయి. ఆ తర్వాత ఆరేళ్లకు బాబ్రీ మసీదును దాని ప్రాంగణాన్ని బ్రిటిష్ పాలకులు రెండుగా చేసి మసీదు ఉన్న భాగాన్ని ముస్లింల ప్రార్థనకు, వెలుపలి భాగాన్ని హిందువులకు అప్పగించారు. 1990లో బిజెపి నాయకుడు ఎల్‌కె అద్వానీ రామమందిరంపై దేశవ్యాప్త రథయాత్ర చేశారు. ఆ తర్వాత లోక్‌సభలో బిజెపి బలం రెండు స్థానాల నుండి 80 స్థానాలకు పైగా పెరిగింది. మతాన్ని రాజకీయాల్ని జోడించి ఆనాడు బిజెపి రాజకీయ ప్రయోజనం పొందింది. ఇప్పుడు ఏకంగా కేంద్ర ప్రభుత్వాన్ని యుపి ప్రభుత్వం మతంతో జోడించి లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలని చూస్తుంది. జనవరి 22న అర్చకుల మంత్రోచ్ఛారణల మధ్య మోడీ, భగవత్‌ల సమక్షంలో శ్రీరాముడి మూర్తికి ప్రాణ ప్రతిష్ట చేస్తారు. దాంతో రాతి విగ్రహానికి చేతనత్వం కలుగుతుంది. దేవుడు భక్తుల మొక్కులు తీర్చడం మొదలెడ్తాడు. మొక్కు లేని భక్తి లేదు కనుక హుండీలు నిండుతుంటాయి. అనతి కాలంలోనే భక్తులు అయోధ్య శ్రీరాముడిని కుబేరుడిని చేస్తారు. ఢిల్లీలో ప్రధాని లోక్‌సభ ఎన్నికలలోగా అదానీ, అంబానీలను మోడీ మరింత అపర కుబేరుల్ని చేస్తారు. అదీ సంగతి.



> **మందిర నిర్మాణానికి 2020 ఫిబ్రవరి నుండి 2023 మార్చి 31 వరకు రూ.90 కోట్లు ఖర్చుచేసినట్లు, అవి పోగా మరో 3వేల కోట్లు తమ దగ్గర నిల్వ ఉన్నట్లు ట్రస్టు వెల్లడించింది. రామమందిర నిర్మాణంలో ఇది రెండో దశ మాత్రమే. మందిర నిర్మాణం 2025 జనవరి నాటికల్లా పూర్తవుతుందట. నిర్మాణం పూర్తి కాకుండానే ఇంత తొందరెందుకంటే రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం అన్నది స్పష్టం....**
>
> **విదేశీ విరాళాల కోసం కూడా కేంద్ర ప్రభుత్వం అయోధ్య ట్రస్టును విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్‌ఎ) కింద రిజిస్టర్ చేసింది. అయితే దాని బ్యాంక్ అకౌంట్ ఢిల్లీలో ఉంది కనుక అందులో ఎంత డబ్బు పడిందో తమకు ఇంకా తెలియదని ట్రస్టు ప్రతినిధి అయోధ్యలో చెప్పారు. 2021 జనవరి 15నుండి 44 రోజుల పాటు దేశమంతటా విరాళాల సేకరణ కోసం శ్రీరామ జన్మభూమి రామ మందిర నిధి సమర్పణ్ అభియాన్‌ను ప్రారంభించారు.**

ప్రజలే చరిత్రను నిర్మిస్తున్నారు

వ్యాఖ్య



డాక్టర్ కొల్లా రాజమోహన్

2023 అక్టోబరు 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసిన తరువాత గాజా పై ఇజ్రాయెల్ ప్రతీకార బాంబుదాడులతో యుద్ధం మరింత వికృతరూపం ధరించింది. ఆసుపత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని కార్పెట్ బాంబుదాడులను సాగిస్తోంది. కొరియా, వియత్నాం యుద్ధాలలో ఒక్క అంగుళంకూడా వదలకుండా కార్పెట్ బాంబుదాడులను చేసి అమెరికా మారణహోమాన్ని సృష్టించింది. అదే చరిత్రను పునరావృత్తం చేస్తూ, ఇజ్రాయెల్ సైన్యం నాన్‌స్టాప్ బాంబు దాడులుచేస్తూ, గాజాలో ఇళ్ళను భూమట్టంచేస్తూ శ్మశానానందాన్ని పొందుతుంది. తన పై దాడి చేసిన హమాస్ వారిని పట్టుకోలేక, 21 వేలమందికి పైగా సామాన్య అమాయక ప్రజలను హతమార్చింది. ఇందులో 70 శాతం మంది చిన్న పిల్లలు, మహిళల తోపాటుగా జర్నలిస్టులు , డాక్టర్లు కూడా వున్నారు. తీవ్ర అననుకూల పరిస్థితులలోవార్తలను సేకరిస్తూ, సంఘర్షణలను, బాంబుదాడులను చిత్రీకరిస్తూ 90 మంది జర్నలిస్టులు తమ ప్రాణాలనర్పించారు. హ్యూమన్ రైట్స్ వాచ్ గత వారం ఇజ్రాయెల్ ప్రభుత్వం యుద్ధ నేరానికి పాల్పడిందని ఆరోపించింది. ప్రజలకు ఆహారం, నీరు అందకుండా కృత్రిమ కరువు ను సృష్టించి ప్రజల ప్రాణాలను తీస్తున్నఇజ్రాయల్ ప్రధాని నెతన్యాహూ ని ఈ నాటి హిట్లర్ అని టర్కీఅధ్యక్షుడు ఎర్డోగాన్ అన్నాడు. అంతేకాకుండా గాజా పై ఈ పిచ్చి దాడులను ఆపేయాలి.'ఇజ్రాయల్ వెంటనే ఈ మాడ్నెస్ ని, దాడులను ఆపాలి." అన్నారు. పాలస్తీనా ప్రజలకు అండగా మేమున్నామంటూ, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజా ప్రదర్శను ఇస్తాంబుల్ పట్టణంలో నిర్వహించారు. మలేసియా ప్రధాని అన్వర్ఇబ్రహీమ్, మలేసియా ఒక స్వతంత్ర సార్వభౌమ దేశమని, అమెరికా వత్తుడులకు లోంగమన్నారు. తమహక్కులకోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న పాలస్తీనియన్లకు పూర్తి సహకారం అందిస్తామని పెద్ద ప్రజా ప్రదర్శనను నిర్వహించారు. కొలంబియా అధ్యక్షుడు పెట్రో. దక్షిణ ఆఫ్రికా అధ్యక్షుడు రామఫాస్ , అమెరికా, జర్మనీ, బ్రిటన్, ప్రపంచ ప్రజలు గాజా ప్రజలకుఅండగా వుంటామన్నారు.

మానవ కల్పిత కరువు

గాజాలోని పాలస్తీనియన్లకు అవసరమయిన ఆహారంలో కేవలం 10 శాతం మాత్రమే అందుతున్నదని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. (UN) ఏజెన్సీలు మరియు (NGO)లు, సహాయ సంస్థల భాగస్వామ్యం అయిన ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ ప్రచురించిన ఒక నివేదికలో, గాజాలో ఉన్న కుటుంబాలు, ఆకలి సంక్షోభంలో తీవ్రమైన ఆహార అభద్రతతో బాధపడుతున్నట్లు పేర్కొంది. గాజాలోని మొత్తం 23 లక్షల జనాభా అతిపెద్ద మానవ కల్పిత కరువు ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని హెచ్చరించింది.

తక్షణ కాల్పుల విరమణ కోసం ఐ రా స పిలుపునిచ్చేందుకు వీల్లేదని అమెరికా వీటోని ప్రయోగించి తన సామ్రాజ్యవాద స్వభావాన్ని మరోసారి నిరూపించుకున్నది.

గాజాలో మానవతావాద పరిస్థితి మరింత భయంకరంగా మారడంతో ఇజ్రాయెల్ సైనిక చర్య సమర్థించలేనిదిగా మారడంతో, టెల్ అవీవ్ యొక్క బలమైన మద్దతుదారు అయిన యునైటెడ్ స్టేట్స్, జర్మనీ, బ్రిటన్ లలోకూడా ప్రజలు తిరగబడుతున్నారు. ప్రభుత్వాలు ఇరుకున పడుతున్నాయి.

ఎర్ర సముద్రంలోని "ఇజ్రాయెల్-లింక్డ్" నౌకలపై యెమెన్ హౌతీ మిలీషియా వారి దాడులను తీవ్రతరం చేయడంతో వివాదం మధ్యప్రాచ్యంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తోంది.

ఇజ్రాయల్-పాలస్తీనాకు పరిమితమయిన యుధభూమి సముద్రానికి మారింది.

పాలస్తీనాకు మద్దతిస్తున్న హౌతీ రెబెల్స్ ఎర్రసముద్రాన్ని (రెడ్ సీ) యుధ క్షేత్రంగా మార్చుకుని ఇజ్రాయల్ తో సంబంధమున్న దేశాల నౌకలపై డ్రోన్లు, క్షిపణు లతో దాడులను చేస్తున్నారు. ప్రపంచ వాణిజ్య రంగంలో ముఖ్యమైన నౌకా రవాణా రంగంలో అత్యంత కీలకమైన మార్గం ఎర్రసముద్ర నౌకా మార్గం. ఈ మార్గం ద్వారానేఅమెరికా, ఐరోపా దేశాలు ఆసియా, ఆఫ్రికా దేశాలతో వ్యాపారం చేసి లాభాలను ఆర్జిస్తూన్నాయి. ఆఫ్రికా చుట్టూ తిరిగిరాకుండా ఈజిప్ట్ లోని సూయజ్ కాలువ-ఎర్రసముద్రం మీదుగా ఆంతర్జాతీయ వాణిజ్యంసాగుతోంది. బాబ్ ఎల్ మండెప్ జలసంధి వద్ద మార్గం చాలా సన్నంగా 29 కి.మీ. మాత్రమే వుండటం వలన సముద్ర నౌకలపై దాడులకు అనువుగా వుంది. దగ్గరలో వున్న ఎమెన్ ను స్థావరంగా చేసుకుని హౌతీ రెబెల్స్ వాణిజ్య నౌకలపై దాడుల ద్వారా, అంజర్జాతీయ వాణిజ్య సమాజాన్ని గాజాలో మారణహోమాన్ని ఆపమని కోరుతున్నారు. ఇజ్రాయల్ కు, అమెరికాకు, యూరప్ లను హడలెత్తిస్తున్నారు. మొత్తం ఆంతర్జాతీయ సమాజానికి అల్టిమేటం ఇస్తున్నారు. అమెరికా నేతృత్వంలోని 10 దేశాల మిలిటరీ బలగాలను ఎర్రసముద్రం లోకి దించి హౌతీలను ఎదుర్కోవాలని అమెరికా"ఆపరేషన్ ప్రాస్పరిటీ గార్డియన్" వ్యూహాలను రచిస్తున్నది. యుధ నౌకల పహారా తో సముద్ర నౌకల ను దాడులనుండి రక్షించటానికి ఎర్రసముద్ర (రెడ్ సీ) సంకీర్ణ రక్షణ కూటమిని అమెరికా ఏర్పాటు చేసింది. ఈ కూటమిలో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, బహరైన్, సేచెలెస్, స్పెయిన్, నార్వే, నెదర్లాండ్, కెనడా, ఇటలీతో 10 దేశాలున్నాయి. ప్రాంతీయ దేశాలలో బలమైన సౌదీ అరేబియా, ఈజిప్ట, చేరలేదు. ఒక్క బహ్రైన్ దేశం ఈ కూటమిలో చేరింది. బహ్ రైన్ దేశం జనాభాలోనూ, వైశాల్యంలోనూ, సైనిక శక్తి లోకూడా చిన్నదేశమే. కూటమిలో చేరటానికి అన్ని నాటో దేశాలు ఉత్సాహం చూపటంలేదు.

గాజా పై దాడులు ఆపకపోతే ప్రపంచ ఇంటర్నెట్ పై కూడా దాడి చేస్తామని హౌతీలు హెచ్చరించారు. బాబ్ ఎల్ మండెప్ జలసంధికి దగ్గర సముద్ర భూగర్భజలాల నుంచి వెళు_న్న సముద్ర కేబుల్ నెట్ వర్క్ వైర్ లను కత్తిరించేస్తామన్నారు. ప్రపంచంలో వున్న ఇంటర్నెట్ డేటా 99 శాతం సబ్ మెరైన్ కేబుల్స్ ద్వారానే జరుగుతుంది.

హౌతీ లు కొత్తగా నౌకల పైననే కాకుండా , ప్రత్యక్షంగా అమెరికా యుధనౌకలపైనా, ఇజ్రాయల్ పోర్టులపై కూడా దాడులను మొదలెట్టారు. అమెరికా యుధనౌకలు హౌతీల మిస్సైల దాడిని ఆపలేకపోయాయి. వందలకొలదీ నౌకలు సముద్రంలో లంగరు వేసి ఆగిపోయాయి. అతి పెద్ద, యం.స్.సీ యునైటెడ్ వాణిజ్య నౌక పై డిసెంబర్ 26న హౌతీ మిలిటరీ మిస్సైల్ తో దాడి చేసినట్లుగా వెల్లడించింది. గెలక్సీ లీడర్ అనే ఇజ్రాయల్ వ్యాపారి నౌకను హైజాక్ చేసి 25 మంది సిబ్బందిని ఎమెన్ లో నిర్బంధించారు. ఇజ్రాయల్ తో అంటకాగుతున్న ఇండియా నౌకలను కూడా వదలలేదు. ఇండియా వస్తున్నఎం.వి.కెమ్.ఫ్లూటో నౌక పైనా, సౌదీనుండి వస్తున్న ఎం.వి.సాయిబాబా నౌకల పైన కూడా డ్రోన్ దాడులు జరిగాయి. భారతదేశం 3 యుధనౌకలను కాపలాగా పంపించింది. అందులో"ఐ యన్ యస్ మారముగో"గైడెడ్ మిస్సైల్ విధ్వంసక నౌక కూడా వుంది.

ప్రపంచ ప్రజలు ఉద్యమించాలి

నౌకలు రెడ్ సీ ద్వారా రోజుకి 16 నాటికల్ మైళ్ళ వేగంతో ప్రయాణించి 25 రోజులలో యూరప్ ని చేరగల్గుతున్నాయి. ఎర్రసముద్రాన్ని తప్పించి ఆఫ్రికా చుట్టూ తిరిగి గుడ్ హోప్ మార్గం ద్వారా ప్రయాణించటానికి 43 రోజులు పడ్తుంది. వ్యయ ప్రయాసలకోర్చిరూట్ మార్చే ప్రయాణానికి 9 రోజులనుండి 30 రోజులు ఆలస్యమవుతుంది. 15 రోజులు ప్రయాణ కాలం పెరిగితే నౌకకు ఇంధనం ఖర్చు అదనంగా 10లక్షల డాలర్ల వుతాయి. వందకు పైగా వాణిజ్య నౌకలు రూటు మార్చుకున్నాయి. ఆఫ్రికా చుట్టూ తిరిగి వెళ్తున్నాయి. ఆయిల్ ధరలు 3 శాతం పెరిగి ఒక బారల్ చమురు ధర 80 డాలర్లకు చేరింది. భీమా కంపెనీలు ప్రతి కంటైనర్ మీద 700 డాలర్ల సర్ ఛార్జి విధిస్తున్నారు. నిత్యవసరవస్తువులన్నిటికీ ఆసియా, ఆఫ్రికా దేశాలపై ఆధారపడిన అమెరికా యూరప్ దేశాలు సరుకుల రవాణా ఆలస్యాన్ని భరించలేవు. ఖర్చు పెరుగుతుంది. ఆసియా ధేశాలకు చమురు సహజ వాయువు దిగుమతులు కష్టవుతాయి. ప్రపంచవ్యాపితంగా ధరలు పెరిగి ద్రవ్యోల్బణం సంభవించి ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తుంది. అంతర్జాతీయ వాణిజ్యానికి ప్రమాదంగా పరిణమించిన సమస్యను పరిష్కరించాలంటే గాజా పై ఇజ్రాయల్ 83 రోజుల మానవ హననాన్ని ఆపేటట్లుగా ప్రపంచ ప్రజలు ఉద్యమించాలి.

టెక్నాలజీ, ఆయుధాలు సమస్యలన్నిటినీ పరిష్కరిస్తాయనే విశ్వాసం అన్నిసార్లూ వాస్తవం కాదని పాలస్తీనీయులు, హౌతీలు నిరూపించారు. ప్రపంచంలో అత్యంత ఆధునిక టెక్నాలజీ సహాయంతో ఏదైనా ముందే కనుక్కోగలమనే ఇంటలిజెన్స్ నెట్ వర్క్ వున్నదనుకుని విర్రవీగే ఇజ్రాయల్ ప్రభుత్వం, హమాస్ దాడిని ముందే పసిగట్టలేకపోయింది. హఠాత్తుగా జరిగిన అక్టోబర్ 7 దాడిని జీర్ణించుకోలేక సాగిస్తున్నవిశృంఖలదాడులు హమాస్ ని పట్టుకోవటం లో విఫలం చెంది విచక్షణారహితంగా సామాన్యప్రజలను హతమారుస్తున్నారు. 200 డాలర్లతో తయరయ్యే డ్రోన్ ల తో , లక్షలకోట్ల డాలర్ల విలువ చేసే నౌకలను హౌతీలు హడలెత్తిస్తున్నారు. లక్షల కోట్ల అంతర్జాతీయ వాణిజ్యం సంక్షోభం లోకి జారేటట్లున్నది. వరస ఎదురుదెబ్బలు తింటూ, డాలర్ పతనం ప్రారంభమయి, ఉక్రెయిన్ లోకూడా భంగపడబోతున్న అమెరికాకు ఇజ్రాయల్ దుశ్చర్యలను చివరకంటా బలపరచటం సాధ్యంకాదు. ప్రజలే చరిత్రను నిర్మిస్తున్నారు.

> **గాజా పై దాడులు ఆపకపోతే ప్రపంచ ఇంటర్నెట్ పై కూడా దాడి చేస్తామని హౌతీలు హెచ్చరించారు. బాబ్ ఎల్ మండెప్ జలసంధికి దగ్గర సముద్ర భూగర్భజలాల నుంచి వెళ్తున్న సముద్ర కేబుల్ నెట్ వర్క్ వైర్ లను కత్తిరించేస్తామన్నారు. ప్రపంచంలో వున్న ఇంటర్నెట్ డేటా 99 శాతం సబ్ మెరైన్ కేబుల్స్ ద్వారానే జరుగుతుంది.**

జనవాక్కు

ఒత్తిడి లేని చదువులు కావాలి...!

చాలా రోజుల నుండి మనకి తెలుగు రాష్ట్రాలో ఇంటర్ విద్యార్థులు మరీ ముఖ్యంగా కార్పొరేటు కళాశాలల్లో చదివేవారు బలవన్మరణానికి పాల్పడటం మనందరం చూస్తూనే ఉన్నాం. ఇటీవల హైదరాబాద్‌లోని మేడిపల్లి ప్రాంతంలో ఓ ప్రైవేట్ కళాశాల లో వర్ష అనే అమ్మాయి తీవ్ర మానసిక ఒత్తిడికి తట్టుకోలేక హాస్టల్ బాత్ రూం లో చున్నీతో ఉరి వేసుకొని చనిపోయింది, తల్లీ తండ్రులు చిన్నప్పటి నుండే పిల్లల్ని కార్పొరేట్ లెవల్లో చదివించాలి అని కోరుకుంటున్నారు, మార్కులే కొలబద్ధగా చూసుకుని మురిసిపోతున్నార,. ఈ మార్కుల వేటలో ఈమ పిల్లలు ఎంత మానసిక ఒత్తిడికి గురవుతన్నారో గమనించరు. , పిల్లలకు లోక జ్ఞానం పెంచే విధంగా చూడాలి, బట్టీ పట్టి చదివించడం సరైన విధానం కాదని విద్యావంతులైన తల్లిదండ్రులు కూడా తెలుసుకోలేకపోవడం బాధాకరం. అటు తల్లి దండ్రుల నుంచి భారీ ఆశలు, ఇటు ర్యాంకుల కోసం పాకులాడే కార్పొరేటు కాలేజీ యాజమాన్యం రుద్దుడు మధ్య వారు నలిగిపోతున్నారు. వీళ్ళ స్వార్థం కోసం పిల్లలు బలవుతున్నారు. విద్య అనేది ఒక కుండలో నీటిని మరొక కుండలో పోయడం వంటిది కాదు. విత్తు నాటడం వంటిది. ఈ ఫిలాసఫీని పాటిస్తే ఆత్మహత్యలు చాలా వరకు నివారించబడతాయి. పిల్లలకు, సులువైన రీతిలో బోధించే పద్ధతి తీసుకురావాలి,మార్కులే జీవితం కాదు. విద్యార్థులూ మీరు పరీక్ష అనేది కేవలం మీ తెలివిని టెస్ట్ చేసే ఒక సాధనం అని గమనించండి. అధిక మార్కుల కోసం ఒత్తిడీ కి లోను కాకండి, తొందరపాటుతో మీ బంగారు జీవితాన్ని బలి పెట్టకండి. పరీక్ష సమయం లో పిల్లలకు అత్మ స్థైర్యాన్ని నింపే ప్రయత్నం చేయాలి

-కిరణ్ ఫిషర్ అడ్వకేట్

వివేకా కుమార్తె, అల్లుడిపై ఛార్జిషీట్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు చేపట్టిన అప్పటి సిబిఐ అధికారి రామ్‌సింగ్, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డిపై పులివెందుల కోర్టులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. వివేకా పిఎ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు ఈ ముగ్గురిపై ఈ నెల 15న కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

సమస్యల పట్ల మీ వైఖరేమిటి?

- టిడిపికి వి.శ్రీనివాసరావు ప్రశ్న
- బిజెపికి వ్యతిరేకంగా చొరవ తీసుకోవాలని సూచన



ప్రజాశక్తి - ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా)

రాష్ట్రాన్ని వెంటాడుతున్న వివిధ సమస్యలపై తెలుగుదేశం పార్టీ తన వైఖరిని వెల్లడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం కెవిఎస్.పురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అనేక అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేసిన తీరు, ఫలితంగా సమస్య వలయంలో రాష్ట్రం కూరుకుపోయిన అంశాన్ని ప్రస్తావించారు. కనీస వేతనాల కోసం అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఎ టీచర్లు, వాలంటీర్లు ఆందోళన బాట పట్టారని అన్నారు. పోలవరం నిర్వాసితులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని చెప్పారు. 'ఈ సమస్యలన్నింటిపైనా మీ వైఖరేమిటి?' అని ప్రశ్నించారు. బిజెపి అమలు చేసిన వినాశకర విధానాలకు వంత పాడుతూ వైసిపి, టిడిపిలు ఇప్పటివరకు రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారన్నారు. ఇది రాష్ట్ర ప్రయోజనాల కోసం బిజెపి యేతర పార్టీలన్నీ ఏకం కావాల్సిన సమయమని, ఆ అవసరం ఎంతో ఉందని చెప్పారు. దీనికి టిడిపి చొరవ తీసుకోవాలని సూచించారు. బిజెపి వ్యతిరేకంగా మాట్లాడితే ఎక్కడ తమ పార్టీ ఉనికికే లేకుండా పోతుందోనన్న భయంతో టిడిపి, వైసిపిలు ఇప్పటి వరకు మోడీకి ఊడిగం చేశారని వ్యాఖ్యానించారు. జనసేన ఏకంగా ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉందని, ఇది దారుణమని అన్నారు. ఇప్పటికైనా టిడిపి వైఖరిలో మార్పురాకపోతే ఆ పార్టీ రాష్ట్రంలో మనుగడ లేకుండా పోతుందని అన్నారు. వరదలు, తుపానుల వల్ల పంట నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వారికి నష్టపరిహారాన్ని ఇంతవరకు చెల్లించలేదని చెప్పారు. అంగన్‌వాడీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయకపోవడంతోనే రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు సమ్మెకు దిగారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. సమస్యలను పట్టించుకోకుండా అధికార, ప్రతిపక్ష పార్టీలు బూటకపు సర్వేలపై ఆధారపడి ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో అంచనాలు వేసుకుంటున్నాయని విమర్శించారు. ఓట్లు వేసే ప్రజలను ఇలా గాలికొదిలేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రామారావు పాల్గొన్నారు.

కదిరిలో వైసిపికి ఎదురు దెబ్బ

పలువురు ప్రజాప్రతినిధుల రాజీనామా

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలంలోని వైసిపికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఎంపిపి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపికి చెందిన ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు తమ రాజీనామా పత్రాలను ఎంపిడిఒ అంజినప్పకు శుక్రవారం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికలలో సౌమ్యుడు అయినా ఎమ్మెల్యే సిద్ధా రెడ్డిని కాదని ఇతరులకు టికెట్ కేటాయిస్తున్నట్టు ఊహాగానాలు వెలువడుతున్నాయని, ఆ పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తమ పదవులకు రాజీనామా చేస్తున్నామని తెలిపారు. వైసిపి జెండా పట్టుకొని ఏనాడు పార్టీ కోసం పనిచేయని వ్యక్తులకు టికెట్ ఇవ్వడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఒకవేళ మైనార్టీకి ఇవ్వాల్సి వస్తే పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న వారు ఉన్నారని ఎమ్మెల్యే సిద్ధా రెడ్డితో మాట్లాడి వారికి ఇవ్వాలని సూచించారు. ఇదే విధంగా నియోజకవర్గంలోని నంబులపూలకుంట, గాండ్లపెంట మండలాల్లోనూ పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీ ఎప్పుడూ?

- నాలుగేళ్ల నుంచి ఎదురుచూపులు
- కొత్త సర్వీస్ రూల్స్‌పై న్యాయశాఖ కొర్రీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. నాలుగేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వీరికి బదిలీలు నిర్వహించలేదు. గతంలో మున్సిపల్, నగరం, మహానగరం యూనిట్‌గా బదిలీలు జరిగాయి. మున్సిపాల్టీలో పనిచేస్తున్న వారు మున్సిపాల్టీలో, నగరంలో పనిచేస్తున్నవారిని నగరంలో, మహానగరంలో పనిచేస్తున్న వారిని ఆ పరిధిలోనే బదిలీలు నిర్వహించింది. మరోపక్క ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో 14,350 మంజూరు మున్సిపల్ ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. వీటిల్లో 12,529 మంది పనిచేస్తున్నారు. 1,821 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2016లో జిల్లాను యూనిట్‌గా తీసుకుంటూ కొత్త సర్వీస్ రూల్స్ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ రూల్స్‌తో 2019లో చివరిసారిగా మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు ప్రభుత్వం నిర్వహించింది. ఆ తరువాత చేపట్టలేదు. 2022లో మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ సమయంలోనే మున్సిపల్ వారికి కూడా బదిలీలు నిర్వహించేందుకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. దీంతో గతంలో ఉన్న సర్వీస్ రూల్స్ వీరికి వర్తించకుండా పోయాయి. కొత్త సర్వీస్ రూల్స్ వీరికి చెల్లవని న్యాయశాఖ కొర్రీలు వేయడంతో ఇవీ నిలిచిపోయాయి. మరోపక్క ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు ఆగిపోయాయి. ప్రభుత్వ పాఠశాలలతో పోల్చుకుంటే మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక అనేక చోట్ల ఎక్కువగా ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో పెరిగినచోట సరిపడా ఉపాధ్యాయులు లేరని, ఉన్న ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. సర్వీస్ రూల్స్ అంశాన్ని పరిష్కరించి సాధ్యమైనంత త్వరగా బదిలీలు, ఉద్యోగోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. నాలుగేళ్ల నుంచి మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు లేవని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. వెంటనే నిర్వహించాలని కోరారు. పెరిగిన పిల్లల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందాలంటే ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు అవసరం కావున వీటిని భర్తీ చేయాలని కోరారు.

వృద్ధురాలిపై సామూహిక అత్యాచారం

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

వృద్ధురాలిపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని రాయవరం రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. రైల్వేస్టేషన్ సమీపంలో నివాసముంటున్న వృద్ధురాలి భర్త గతంలో చనిపోయారు. కేవలం పింఛను సొమ్ముతో ఈమె జీవనం సాగిస్తోంది. వృద్ధురాలు ఒంటరిగా జీవనం సాగిస్తున్న విషయం అదే ప్రాంతానికి చెందిన యువకులు గమనించారు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలిపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గణతంత్ర వేడుకులకు కెయు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్



ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకలకు కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని, 16వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి క్యాడెట్ టి.లక్ష్మి దమయంతి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ కళాశాల ఎఎన్ఒ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రామశేఖరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఏడు శిక్షణ శిబిరాల్లో పది వేల మంది క్యాడెట్స్ పాల్గొనగా లక్ష్మి దమయంతి ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు తెలిపారు. ఎన్‌సిసి విభాగం పురోగమించడానికి, విద్యార్థులు ఎన్‌సిసిలో ఉత్తమ ప్రదర్శన సాధించడానికి వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి ప్రోత్సాహం ధోహదపడిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి దమయంతిని వర్సిటీ విసి జ్ఞానమణి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.వి.బ్రహ్మాచారి, కళాశాల ప్రిన్సిపల్ ఆర్.విజయకుమారి, 16వ ఆంధ్ర బెటాలియన్ కమాండెంట్ కల్నల్ సంసార్ సింగ్, తదితరులు అభినందించారు.

1న పిఎస్ఎల్‌వి సి-58 రాకెట్ ప్రయోగం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

2024 జనవరి 1న మరో కీలక ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సిద్ధమయింది. శ్రీహరికోటలోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి పిఎస్ఎల్‌వి-సి 58 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. 480 కిలోల బరువు ఉన్న ఎక్స్‌పో శాట్, కేరళ యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించారు. ఒక కేజీ బరువున్న విఐవై శాటును ప్రయోగించనున్నారు. ఐదేళ్ల జీవితకాలం కలిగిన ఎక్స్‌పో శాటిలైట్ ఎక్స్ కిరణాల ధ్రువనాన్ని అధ్యయనం చేయడం కోసం రూపొందించారు. బెంగళూరులోని యు.ఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో తయారు చేసిన ఈ ఉపగ్రహాన్ని ఇప్పటికే శ్రీహరికోటకు తీసుకొచ్చి రాకెట్ నందు అనుసంధానం పనులు చేపట్టారు. భూమికి 650 కిలోమీటర్ల తక్కువ దూరంలో పిఎస్ఎల్‌వి -సి 58 రాకెట్ ఈ ఉపగ్రహాన్ని విడిచి పెట్టేలా ప్రణాళికలు రూపొందించారు. టెలిస్కోప్ లాగా పని చేసే ఈ ఉపగ్రహ సేవలో మన దేశానికి ఎంతో ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పిఎస్ఎల్‌వి -సి 58 రాకెట్ ప్రయోగం తర్వాత ఆ వెంటనే జిఎస్ఎల్‌వి మార్కు- 2 ప్రయోగాన్ని కూడా ఇస్రో చేపట్టనుంది.

భారీగా విద్యుత్ బకాయిలు

- 2022-23 ఆడిట్ నివేదికలో వెల్లడి
- ఆరు ఓవర్‌డ్యూస్‌లు 100 నుంచి 285 రోజుల వరకు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

విద్యుత్ సంస్థల్లో భారీగా బకాయిలు పేరుకు పోతున్నాయి. పలు సంస్థల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆ సంస్థలు ఓవర్‌డ్యూస్‌గా చూపుతున్నాయి. 2022-23 ఆర్థికసంవత్సరానికి రూపొందించిన ఆడిట్ నివేదికలో ఈ విషయం వెల్లడైంది,. కొన్ని వాయిదాల్లో అయితే ఎన్‌పిఎ (నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్) జాబితాలోకి కూడా ఇవి చేరుతున్నాయి. ప్రతి ఏటా ఇదే పరిస్థితి ఏర్పడుతున్నప్పటికీ జెన్‌కో, దాని అనుబంధ సంస్థల్లో మాత్రం మార్పులు కనిపించడం లేదు.కృష్ణపట్నం విద్యుత్ కేంద్రం కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎపి పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో గత ఆర్థిక సంవత్సరమంతా ఓవర్‌డ్యూస్‌లోనే కొనసాగినట్లు ఆడిట్ నివేదికలో తేటతెల్లమైంది. 2022 ఏప్రిల్, మే నెలల్లో చేయాల్సిన చెల్లింపులు సజావుగానే చేసినప్పటికీ, ఆ తరువాత నెలల చెల్లింపులు మాత్రం ఓవర్‌డ్యూస్‌లోకి వెళ్లిపోయాయి. జూన్ 30న చేయాల్సిన 1,170 కోట్ల రూపాయల వాయిదా అయితే ఏకంగా 275 రోజులపాటు చెల్లింపులకు నోచుకోకపోవడంతో వాటికి ఓవర్‌డ్యూస్ ఖాతాగా రుణమిచ్చిన సంస్థలు ప్రకటించాయి. అలాగే జులైలో చేయాల్సిన చెల్లింపులు 244 రోజులు, ఆగస్టు చెల్లింపులు 213 రోజులు, సెప్టెంబర్‌వి 183 రోజులు, అక్టోబర్‌వి 152 రోజులు, నవంబర్ నెల చెల్లింపులు 122 రోజులపాటు ఓవర్‌డ్యూస్‌లోనే ఉండిపోయాయి. వాస్తవానికి 90 రోజులు దాటితే అవి ఎన్‌పిఎ జాబితాలోకి వెళ్లిపోతాయి. అంటే సాంకేతికంగా జూన్ నుంచి నవంబర్ వరకు చేయాల్సిన చెల్లింపులు ఎన్‌పిఎ జాబితాలోకి చేరిపోయినట్టే భావించాల్సి ఉంటుంది.

జెన్‌కో రుణాలూ భారీగానే


జెన్‌కో తీసుకుంటున్న రుణాలు కూడా భారీగానే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది మార్చి నాటికి 33,088 కోట్ల రుణాలు ఉన్నట్లు ఆడిట్ లెక్కల్లో తేలింది. ఇవి కాకుండా డిస్కామ్‌లు, ఇతర విద్యుత్ అనుబంధ సంస్థల రుణాలు కలిపితే మరో పాతిక వేల కోట్ల వరకు ఉంటాయన్నది ఒక అంచనా. అయితే గతేడాది కన్నా 2023 మార్చి వరకు గమనిస్తే ఆదాయం కొంతవరకు పెరిగినట్లు తేలింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 12,968 కోట్లు ఆదాయంగా లభించినట్లు ప్రకటించారు. ఇందులో విద్యుత్ అమ్మకాల ద్వారానే 10,497 కోట్లు ఆదాయంగా సమకూరి నట్లు తేలింది. ఈ ఆదాయంలోనుంచే రుణాలకు అసలు వాయిదాలు, వడ్డీలు చెల్లించాల్సి ఉంటోంది.

ఎపి విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను
రెగ్యులరైజ్ చేయాలి

తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల యూనియన్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల యూనియన్ (1535) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు ఎంఎ వజీర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాతికేళ్ల నుంచి కష్టపడి పనిచేస్తున్న కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం అన్యాయానికి గురిచేసిందని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులుగా తీసుకుంటామని ప్రతిపక్ష నేతగా చేపట్టిన పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటి వరకు ఒక్కరినీ రెగ్యులరైజ్ చేయకుండా 24 వేల కుటుంబాలను అన్యాయానికి గురిచేశారని విమర్శించారు. నాలుగేళ్ల నుంచి విడిఎ కూడా నిలిపివేశారని తెలిపారు. వేతన సవరణ సమయంలో రావాల్సిన బకాయి విడిఎలను వేతన సవరణగా చూపించి ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా మంది ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నారని, ఎలాంటి



హక్కులు లేకపోవడంతో ప్రయోజనాలు ఏమీ లేకుండా శూన్యంగా మిగిలిపోయారని పేర్కొన్నారు. 1998లో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను అప్పటి టిడిపి ప్రభుత్వం క్యాజువల్ లేబర్స్‌గా ఎన్ఎంఆర్, విలేజ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో 24 వేల మంది కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్ పేరుతో ఉద్యోగాలు ఇస్తూ స్కేలు, డిఎ, హెచ్‌ఆర్ఎ, అలవెన్సులు, పిఆర్‌సి ఇతర ప్రయోజనాలు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాబోయే ఎన్నికల్లోపు విద్యుత్ సంస్థలో పనిచేసే 24 వేల మందికి 1998 మాదిరిగా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమ్మెలో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులు, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఎపి స్టేట్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి వెంకటరామయ్య, కె సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు పి అజయ్‌కుమార్, ట్రెజరర్ పి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమ్మెలో ఉన్న ఉద్యోగులు కోర్కెలు న్యాయ సమ్మతమైనవని అన్నారు. సంఘాలతో ప్రభుత్వం చర్చలు చేస్తున్నా.. వారి న్యాయమైన కోర్కెలను తీర్చకుండా చర్చలు ముగించిందని, దీనిని ఖండిస్తున్నామని అన్నారు..

మణిపూర్ గాయకుడు అఖు చింగాంగ్‌బామ్ కిడ్నాప్, విడుదల

ఇంఫాల్: మణిపూర్‌కు చెందిన గాయకుడు, గీత రచయిత అఖు చింగాంగ్‌బామ్‌ను సాయుధ దుండగులు శుక్రవారం కిడ్నాప్ చేశారని, ఆ తరువాత విడుదల చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన బంధువుల కథనం ప్రకారం... ఇంఫాల్‌లోని అఖు ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి, ఆయన భార్య, తల్లిని గన్‌పాయింట్‌లో ఉంచి, ఆయనను కిడ్నాప్ చేశారు. అనంతరం ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో ఆయన నివాసానికి 20 కిలోమీటర్ల దూరంలో విడిచిపెట్టారు. ఈ విషయాన్ని పోలీసులు నిర్ధారించారు. కిడ్నాపర్లు తమను డబ్బు డిమాండ్ చేయలేదని, అఖు కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ఆయన బంధువు తెలిపారు. అఖును గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని, ఆ తరు వాత విడిచిపెట్టారని తమకు సమాచారం అందిందని పోలీసు అధికారి ఒకరు చెప్పారు.

సిఇసి, ఇసి నియామకంపై బిల్లుకు
రాష్ట్రపతి ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఇసిలు) నియామకం, సర్వీసు నిబంధనలను నియంత్రించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పార్లమెంటు ఉభయ సభలు గతంలో ఆమోదించిన బిల్లు ప్రకారం సిఇసి, ఇసిలను నియమించే ఎంపిక కమిటీకి ప్రధానమంత్రి, కేంద్ర కేబినెట్ మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అధ్యక్షత వహిస్తారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కమిటీ నుంచి తొలగించి, మంత్రిని చేర్చారు.

జెడి(యు) అధ్యక్షులుగా నితీష్

న్యూఢిల్లీ : బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ జనతాదళ్ (యునైటెడ్) అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం జరిగిన జెడియు జాతీయ కార్యవర్గ సమావేశంలో సీనియర్ నేత లలన్ సింగ్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రకటన వెలువడిన కొన్ని నిమిషాలకే ఆయన రాజీనామాను ఆమోదించడంతోపాటు పార్టీ అధ్యక్షుడిగా నితీష్‌కుమార్ నియమితులయ్యారు.

ఫ్రాన్స్ పోలీసుల అదుపులోనే 25 మంది భారత ప్రయాణికులు

పారిస్ : ఫ్రాన్స్‌లో నిలిపివేసిన విమానానికి చెందిన 25 మంది భారతీయులు అక్కడి పోలీసులు అదుపులోనే ఉన్నారు. మానవ అక్రమ రవాణా ఆరోపణలపై విచారణ చేస్తున్నారు. వీరి నిర్బంధాన్ని మరో ఎనిమిది రోజుల పాటు అప్పీల్ కోర్టు శుక్రవారం పొడిగించింది. నాలుగు రోజుల పాటు ఫ్రాన్స్‌లో నిలిపివేసిన విమానం మంగళవారం భారత్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే.

మత ఉద్రిక్తతలు సృష్టించేందుకే

- రాజకీయ ప్రాజెక్టుగా రామ మందిర ప్రారంభోత్సవం
- ప్రధాని మోడీ, యుపి సిఎం యోగి తీరుపై ఏచూరి
- కేంద్రం తీరు రాజ్యాంగానికి, లౌకికవాద స్ఫూర్తికి, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని వ్యాఖ్య

తిరువనంతపురం : ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తప్పుపట్టారు. మత ఉద్రిక్తతను సృష్టించేందుకే రామ మందిర ప్రారంభోత్సవాన్ని ప్రధాని మోడీ, ఉత్తర ప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ రాజకీయ కార్యక్రమంగా మార్చారని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని మొత్తం మోహరించటం ద్వారా కేంద్రం రాజ్యాంగానికి, లౌకికవాద స్ఫూర్తికి, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని తెలిపారు. "మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే, రామమందిర ప్రారంభోత్సవాన్ని ప్రధాని, యుపి ముఖ్యమంత్రి చేయాలనుకుంటే, ఇందుకు మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగిస్తే.. దానర్థం రాష్ట్రాన్ని ఒక నిర్దిష్ట మతంతో గుర్తిస్తున్నారు. అది భారత రాజ్యాంగానికి, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం" అని ఆయన అన్నారు.

కేరళ కాసర్‌గోడ్‌లోని చెంగాల గ్రామ పంచాయతీలో సిపిఎం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పాలస్తీనా సంఘీభావ సభను ప్రారంభించిన అనంతరం ఏచూరి మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరి 22న జరిగే అయోధ్య ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తమ ప్రతినిధులను పంపేది లేదని సిపిఎం ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. గత వారం అయోధ్య ఆలయ నిర్మాణ, నిర్వహణ బాధ్యతలను అప్పగించిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం కమిటీ న్యూఢిల్లీలోని సిపిఎం ప్రధాన కార్యాలయానికి వచ్చినట్టు ఏచూరి తెలిపారు. "నిర్మాణ కమిటీ అధినేత వెంట విహెచ్‌పి నేత ఉన్నారు. వారు నన్ను ఆహ్వానించారు. అప్పుడు నన్ను హాజరవుతారా.! అని అడిగారు. నేను లేదని చెప్పాను" అని



పాలస్తీనా సంఘీభావ సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

ఏచూరి అనటంతో సభ చప్పట్లతో మార్మోగింది. ఆలయ ప్రారంభోత్సవాన్ని రాజకీయ ప్రాజెక్టుగా మార్చారని రామమందిరం ట్రస్టు నేతలకు చెప్పినట్టు ఆయన తెలిపారు.

రాజ్యం ఏదైనా నిర్దిష్ట మతాన్ని ప్రకటించదు, పోషించదు అని ఏచూరి అన్నారు. హిందూత్వ పటిష్టత కోసం మత వర్గాల మధ్య వైషమ్యాలు పెంచే పరిస్థితి ఏర్పడుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "తమ లక్ష్యాన్ని సాధించటానికి జియోనిజం, హిందూత్వ రెండూ చరిత్రను మళ్లీ రాస్తాయి. అవి మన చారిత్రక పరిణామాన్ని నాశనం చేస్తాయి. పాఠ్యపుస్తకాలు మారాయి. కొత్త చరిత్ర కనుగొనబడింది. అది మైనారిటీలపై ద్వేషాన్ని వ్యాప్తి చేయటంపై ఆధారపడింది" అని ఏచూరి విమర్శించారు. జియోనిజం, హిందూత్వ మధ్య ఉన్న సైద్ధాంతిక సాన్నిహిత్యం అనేది అక్టోబర్ 7 దాడి తర్వాత ప్రధాని మోడీ ఇజ్రాయెల్‌కు తక్షణ మద్దతును అందించడానికి దారితీసిందని తెలిపారు. పాలస్తీనా ఆందోళనకు భారత్ సాంప్రదాయిక మద్దతును పునరుద్ఘాటించడానికి రెండు వారాల కంటే ఎక్కువ సమయం పట్టిందన్నారు. మోడీ ప్రభుత్వం తన సొంత హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకెళ్లటానికి అమెరికా, ఇజ్రాయెల్, భారత్ మధ్య బంధాన్ని గత పదేళ్లుగా బలోపేతం చేస్తున్నదని ఆయన విమర్శించారు.



విజయకాంత్ అంత్యక్రియల సందర్భంగా గన్‌సెల్యూట్ నిర్వహిస్తున్న పోలీసులు

విజయకాంత్‌కు కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

చెన్నై : ప్రముఖ నటులు, డిఎండికె వ్యవస్థాపకులు విజయకాంత్‌కు అశ్రునయనాల మధ్య శుక్రవారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. అనారోగ్యంతో గురువారం ఆయన కన్నుమూసిన సంగతి తెలిసిందే. గంధపు చెక్కలతో కూడిన శవపేటికలో ఉంచిన విజయకాంత్ భౌతికకాయాన్ని డిఎండికె ప్రధాన కార్యాలయంలో ఆవరణలో శుక్రవారం ఖననం చేశారు. పోలీసులు 72 రౌండ్ల గన్ సెల్యూట్‌తో వందనం సమర్పించారు. ముందుగా అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఐలాంగ్ గ్రౌండ్స్‌లో ఉదయం 6 గంటల నుంచి విజయకాంత్ భౌతికకాయాన్ని ఉంచారు. ఈ తరువాత పార్థివ దేహాన్ని ప్రత్యేక వాహనంలో కోయంబేడులోని డిఎండికె ప్రధాన కార్యాలయానికి తరలించారు. విజయకాంత్ అభిమానులు, మద్దతుదారులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభం కావాల్సిన అంతియయాత్ర ఎట్టకేలకు 3 గంటలకు ఐలాండ్ గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైంది. రహదారికి ఇరువైపులా అభిమానులు బారులుతీరారు. డిఎండికె ప్రధాన కార్యాలయం వద్ద తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ నివాళి అర్పించారు. అన్నాడిఎంకె నాయకులు డి జయకుమార్, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీరు సెల్వం, టిఎంసి నాయకులు జికె వాసన్, ఇతర ప్రముఖులు నివాళులర్పించారు. అంత్యక్రియల కార్యక్రమానికి పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు.

రాష్ట్రపతి పరిశీలనకు బిల్లులు పంపడంపై
మార్గదర్శకాలు రూపొందించండి

- సుప్రీంను కోరిన కేరళ

న్యూఢిల్లీ : రాష్ట్ర శాసన సభ ఆమోదించి పంపించిన బిల్లులను గవర్నర్ ఎంతకాలంలో ఆమోదించాలనే అంశానికి సంబంధించి మార్గదర్శకాలను రూపొందించాల్సిందిగా కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. గవర్నర్ ఎంతకాలం తన వద్ద బిల్లులను రిజర్వ్ చేయవచ్చునో, రాష్ట్రపతి పరిశీలనకు ఎంతకాలంలో పంపించాలో, ఎంతకాలంలో అసెంబ్లీకి తిప్పి పంపాలి అనే అంశాలపై స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరింది. అత్యున్నత న్యాయస్థానంలో గతంలో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌కు సవరణ చేయడం ద్వారా ఈ అంశాలను తాజాగా కేరళ ప్రభుత్వం లేవనెత్తింది. రాజ్యాంగంలోని 200వ అధికరణంలోని మొదటి నిబంధనలో ఉన్న సాధ్యమైనంత త్వరగా అనే పదబంధాన్ని, గవర్నర్‌కు సమర్పించిన బిల్లుల పరిష్కారానికి వర్తించే టైమ్‌లైన్ అంశంలో కూడా సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కేరళ కోరింది. కేరళ ప్రభుత్వం పంపించిన ఎనిమిది బిల్లులను రెండేళ్లపాటు పరిశీలించకుండా వాటిని ఎందుకు రిజర్వ్ చేశారని నవంబర్ 20న సుప్రీంకోర్టు గవర్నర్‌ను ప్రశ్నించిన సంగతి తెలిసిందే. అనంతరం ఏడు బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపించారని కోర్టు దృష్టికి కేరళ ప్రభుత్వం తీసుకొచ్చింది. తమ పరిశీలన కోసం పంపిన బిల్లులపై గవర్నర్ ఏళ్ల తరబడి నిష్క్రియాపరంగా వ్యవహరించారని, రాజ్యాంగం ప్రకారం తనకు సమర్పించిన అధికారాలను, విధులను నిర్వర్తించడంలో విఫలమయ్యారని కేరళ ప్రభుత్వం తరపున సికె శశి తాజా పిటిషన్‌లో పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను మరింత ఆలస్యం చేయకుండా పరిష్కరించేలా గవర్నర్‌ను ఆదేశించాలని కోరారు. ఆర్టికల్ 200 ప్రకారం సాధ్యమైనంత త్వరగా బిల్లులను ఆమోదించకుండా, గవర్నర్లు బిల్లులను పెండింగ్‌లో ఉంచడం వల్ల అనేక రాష్ట్రాలు ఇటువంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. క్రిస్మస్ సెలవుల అనంతరం సుప్రీంకోర్టు ఈ కేసును పరిగణనలోకి తీసుకునే అవకాశముంది.

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- ఐలు 14వ అఖిల భారత మహాసభలో జస్టిస్ ఎస్ మురళీధర్ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మతోన్మాదం, మతపరమైన సమీకరణలు శాంతి భద్రతలకు ముప్పు తెచ్చాయని పంజాబ్, ఒడిశా, హర్యానా రిటైర్డు ప్రధాన న్యాయమూర్తి ఎస్ మురళీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజలు అయోమయంలో ఉన్నారని, వారికి దారిచూపాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని పేర్కొన్నారు. 'రాజ్యాంగాన్ని మార్చండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అన్నదే నేటి నినాదమని అన్నారు. ఆ లక్ష్య సాధనలో చట్టాన్ని అధ్యయనం చేసే, బోధించే, వాదించే న్యాయవాదులపై బృహత్తర బాధ్యత ఉందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా నగరంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) 14వ మహాసభ గురువారం ప్రారంభమైంది. 'చట్టం, ప్రజాస్వామ్యం' అనే అంశంపై జస్టిస్ ఎస్ మురళీధర్ మాట్లాడారు. ప్రజలందరికీ న్యాయం అందాలని, అందుకోసం ఐలు పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో చట్టం చాలా కీలకమైందన్నారు. అట్టడుగు వర్గాల వారికి చట్టాలు అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు.

మీడియా స్వేచ్ఛపై దాడి : టెలిగ్రాఫ్ ఎడిటర్

దేశంలో మీడియా స్వేచ్ఛపై దాడి జరుగుతోందని టెలిగ్రాఫ్ దినపత్రిక ఎడిటర్ ఆర్ .రాజగోపాల్ తెలిపారు. మీడియా స్వేచ్ఛ, ఆధిపత్యం' అనే అంశంపై శుక్రవారం జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కొంతమంది చేతుల్లోనే ప్రధాన మీడియా స్రవంతి ఉందని, ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయని తెలిపారు. మీడియా రంగంలోకి కార్పొరేట్ దిగ్గజాలు ప్రవేశించి, మీడియా విలువలను దిగజార్చాయని విమర్శించారు. ప్రభుత్వాల కనుసన్నల్లో మీడియా సంస్థలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే మీడియా దాడులను ఎదుర్కొంటున్నదని పేర్కొన్నారు. జర్నలిస్టులపై



ఐలు 14వ అఖిల భారత మహాసభలో మాట్లాడుతున్న జస్టిస్ ఎస్ మురళీధర్

దాడులు పెరిగాయని, హత్యలకు గురవుతున్నారని తెలిపారు. మీడియా రంగం వాస్తవికతకు దూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నిఘా సాంకేతికత జర్నలిస్టులుసహా ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తోందన్నారు. జర్నలిస్టులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినప్పుడు ఎంట్రీ రిజిస్టర్‌పై సంతకాలు చేయిస్తున్నారని, దీంతో ఎవరైనా జర్నలిస్టులు వార్తలను ప్రింట్ చేసినా, ప్రసారం చేసినా ఆ రిజిస్టర్‌ను పరిశీలించి వార్తల మూలాన్ని తెలుసుకోవచ్చున్నారు. దీనివల్ల జర్నలిస్టులు, తమ వార్తల మూలాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భయపడుతున్నారని పేర్కొన్నారు. సిసి కెమెరాలతో ప్రతి పౌరుడిపై నిఘా పెడుతున్నారని పేర్కొన్నారు. పెగాసస్ వంటి వాటిని ప్రభుత్వం తప్ప ఎవరు ఉపయోగించగలరు? ఈ విషయంలో ప్రభుత్వం సహకరించడం లేదని సుప్రీంకోర్టు వేసిన కమిటీ కూడా పేర్కొందని అన్నారు. పెగాసస్‌ను భారతదేశంలో ఉపయోగించారా? లేదా? అనే అంశంపై ప్రభుత్వం ఇప్పటివరకూ సమాధానం చెప్పలేదన్నారు. అమెరికాలో వాటర్ గేట్ కేసులో ప్రెసిడెంట్ నిక్సన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని, భారత్‌లో పెగాసస్ లాంటి పెద్ద కుంభకోణం జరిగినా ఏమీ జరగలేదని రాజగోపాల్ అన్నారు. జర్నలిస్టులు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకపోయినా, న్యాయమూర్తులు స్వతంత్రంగా పని చేయకపోయినా ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసినట్లేనని రాజగోపాల్ తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు న్యాయవాదులు ముందుకు రావాలన్నారు. న్యాయవాదులు మౌనంగా ఉంటే దేశంలో ప్రజాస్వామ్యం అంతరించిపోతుందని, చరిత్ర క్షమించదని అన్నారు.

పలు తీర్మానాల ఆమోదం

పాలస్తీనాలో ఇజ్రాయిల్ మారణకాండను, మహిళలు, పిల్లలపై దారుణ హింసాకాండను ఖండిస్తూ చేసిన తీర్మానం మహాసభ ఆమోదించింది. స్థానిక భాషలను హైకోర్టు అధికార భాషగా చేయడం, న్యాయ వ్యవస్థలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, మణిపూర్ అల్లర్లను ఖండించడం, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ అందించడం, దేశవ్యాప్త ఏకీకృత న్యాయవాద సంక్షేమాన్ని అమలు చేయడానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను సిద్ధం చేయడం వంటి తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ప్రధాన కార్యదర్శి నివేదికపై చర్చలో 26 రాష్ట్రాల నుంచి 81 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. తమ రాష్ట్రాల్లో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిర్వహించిన పోరాటాలను వివరించారు.

ప్రజా సంఘాల సౌహార్ద సందేశాలు

ఎస్ఎఫ్ఐ అఖిల భారత కార్యదర్శి మయూఖ్ బిస్వాస్, మహిళా సంఘం అఖిల భారత కార్యదర్శి కొణినికా ఘోష్, పీపుల్స్ రిలీఫ్ కమిటీ కార్యదర్శి ఫువాద్ హలీమ్ తదితరులు సౌహార్ద సందేశాలిచ్చారు.

ఘనంగా మహాసభ ప్రారంభం

ఐలు 14వ అఖిల భారత మహాసభ హౌరాలోని అశోక్ బికాష్ మంచ్, నారా నారాయణ్ గుప్తా నగర్‌లో గురువారం ఘనంగా ప్రారంభమైంది. 'మతోన్మాదంపై పోరాటం, రాజ్యాంగాన్ని కాపాడండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' నినాదంతో జరుగుతున్న ఈ మహాసభను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దీపక్ గుప్తా ప్రారంభించారు.

పశ్చిమ బెంగాల్ మాజీ న్యాయశాఖ మంత్రి, ఐలు సీనియర్ నాయకులు రబిలాల్ మైత్రా పతకావిష్కరణ చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఆహ్వాన సంఘం కమిటీ ఛైర్మన్ జస్టిస్ ఎకె గంగూలీ స్వాగతోపన్యాసం చేశారు. ప్రారంభ సమావేశానికి ఐలు ఆలిండియా అధ్యక్షులు బికాష్ రంజన్ భట్టాచార్య అధ్యక్షత వహించారు. ఐలు ప్రధాన కార్యదర్శి పివి సురేంద్రనాథ్ కార్యాచరణ నివేదికను సమర్పించారు. మూడు రోజుల పాటు జరిగే మహాసభకు వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

దళితులు, గిరిజనులకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛను

- పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే
- జార్ఖండ్ ప్రభుత్వ నిర్ణయం

రాంచీ : దళితులు, గిరిజనులకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్ ఇవ్వనున్నట్లు జార్ఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. తమ ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా రాంచీలోని మొరదబడి మైదానంలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో జార్ఖండ్ ముక్తి మోర్చా చీఫ్, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రెండు కీలక ప్రకటనలు చేశారు. దళితులు, గిరిజనులకు వృద్ధాప్య పింఛను అర్హత వయసును 60 నుంచి 50 ఏళ్లకు తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో స్థాపించే కంపెనీలలో 75శాతం ఉద్యోగాలు స్థానికులకు రిజర్వ్ చేయబడతాయని తెలిపారు. జార్ఖండ్ దేశంలోనే అత్యంత పేద రాష్ట్రమని, అయినప్పటికీ కోవిడ్ సమయంలో ఇతర రాష్ట్రాలకు ఆక్సిజన్ సరఫరా చేశామని గుర్తు చేశారు. 2000లో రాష్ట్రం ఏర్పటినప్పటి నుంచి 16 లక్షల మందే పింఛను ప్రయోజనాలను పొందారని, తమ సంకీర్ణ ప్రభుత్వం 36 లక్షల మందికి పెన్షన్ అందించిందని చెప్పారు.

ఉల్ఫాతో శాంతి ఒప్పందం

- సంస్థ ప్రతినిధులతోపాటు, కేంద్రం, అస్సాం సంతకాలు

న్యూఢిల్లీ : యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం (ఉల్ఫా) ప్రతినిధులతో సానుకూల చర్చల అనంతరం శాంతి ఒప్పందంపై కేంద్రం, అస్సాం ప్రభుత్వం శుక్రవారం సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా ఉల్ఫా ప్రతినిధులు మాట్లాడుతూ 'ఈ ఒప్పందం అస్సాంలో శాశ్వత శాంతిని తీసుకురావాలి' అనే అభిలాషను వ్యక్తం చేశారు. తమవైపు నుంచి ఏదైనా తప్పు జరిగితే క్షమాపణలు కోరుతున్నామని అన్నారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మాట్లాడుతూ ఈ ఒప్పందంతో రాష్ట్రంలో ఉల్ఫా శకం ముగిసినట్లేనని చెప్పారు. ఉల్ఫాకు చెందిన దాదాపు 8,700 మంది కార్యకర్తలు కూడా ఈ శాంతి ఒప్పందంలో చేరినట్లుగా తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మాట్లాడుతూ అస్సాం భవిష్యత్‌కు ఇది బంగారు రోజుగా పేర్కొన్నారు. గత ఐదేళ్లలో తొమ్మిది శాంతి ఒప్పందాలు చేసి ఈశాన్యంలో శాంతి నెలకొల్పామని తెలిపారు. ఈ ఒప్పందాన్ని అమలు చేయడానికి కాలపరిమితితో కూడిన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేస్తుందని, ఇందు కోసం ఒక కమిటీని కూడా ఏర్పాటు చేస్తామని ఉల్ఫాకు హామీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సంతకాలు కార్యక్రమంలో అమిత్‌షా, హిమంత బిశ్వశర్మ, అరబింద రాజ్‌ఖోవా నేతృత్వంలోని 16 మంది ఉల్ఫా ప్రతినిధులు పాల్గొన్నారు

విద్యా రంగంపై దాడిని తిప్పికొట్టండి

(మొదటి పేజీ తరువాయి)

దూరమవుతున్నట్లు ప్రభుత్వ అధికారిక గణాంకాలే తెలియజేస్తున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వీరందరినీ తిరిగి బడుల్లో చేర్పించాలన్నారు. మూతబడిన పాఠశాలలను తిరిగి తెరవాలని డిమాండ్ చేశారు. పాఠ్యాంశాల్లో డార్విన్ సిద్ధాంతాన్ని, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల చరిత్రలను తొలగించడం ఆపాలన్నారు. లేనిపక్షంలో చరిత్ర నుంచి బిజెపిని తొలగించడం ఖాయమని హెచ్చరించారు. రాష్ట్రంలో విశాల పోరాటాలకు ఎస్ఎఫ్ఐ సిద్ధంగా ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ తెలిపారు. ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు ఎస్ఎఫ్ఐ ఈ మహాసభలో 30 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ పావని మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎల్‌కెజి టు పిజి వరకూ ఉచిత విద్య అందిస్తామని చెప్పిన వైసిపి, అధికారంలోకి వచ్చాక భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. 2024లో తిరిగి అధికారంలోకి రావాలంటే విద్యా సంస్థల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, మూతబడిన పాఠశాలల పునరుద్ధరించాలని, అందరికీ ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు.. ఈ సభలో ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరహాలు, ఎం.సూరిబాబు, రాష్ట్ర కమిటీ నాయకులు పి.రామ్మోహన్, జెఎల్.నాయుడు, సిహెచ్.వెంకటేశ్వర్లు ఎన్.కిరణ్, సిహెచ్.వినోద్, అబ్దుల్లా, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ చివరి రోజైన శుక్రవారం కాకినాడలో జరిగిన ప్రదర్శనలో విద్యార్థులు కదం తొక్కారు. ఎస్ఎఫ్ఐ జెండాలు, బ్యానర్లతో నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. కాకినాడలోని ఆనంద భారతి గ్రౌండ్ నుంచి మెయిన్ రోడ్డు, సాలిపేట హైస్కూల్, ఫైర్ స్టేషన్, పిండాల చెరువు మీదుగా బహిరంగ సభా ప్రాంగణమైన మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్ వరకూ సాగింది. ఎస్ఎఫ్ఐ జిందాబాద్, విద్యార్థుల ఐక్యత వర్థిల్లాలి, రిజెక్ట్ ఎన్ఇపి, రిజెక్ట్ బిజెపి, సేవ్ ఎడ్యుకేషన్, సేవ్ ఇండియా అంటూ దారి పొడవునా నినాదాలతో హోరెత్తించారు. ప్రదర్శన అగ్రభాగంలో అఖిల భారత నేతలు, రాష్ట్ర నాయకులు నడిచారు.

రూ.40 వేల కోట్ల స్కామ్

కోవిడ్ సమయంలో యడ్యూరప్ప ప్రభుత్వ అవినీతిపై బిజెపి ఎమ్మెల్యే ఆరోపణలు



బసనగౌడ పాటిల్ యత్నాల్



బిఎస్ యడ్యూరప్ప

బెంగళూరు : కోవిడ్ మహమ్మారి సమయంలో వైరస్‌ను ఎదుర్కొనే పేరుతో అప్పటి ముఖ్యమంత్రి బిఎస్ యడ్యూరప్ప రూ.40 వేల కోట్ల స్కామ్‌కు పాల్పడ్డారని బిజెపికే చెందిన విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ ఆరోపించారు. ' కోవిడ్ సమయంలో ఎన్ని వేల కోట్ల రూపాయల దోపిడి జరిగిందో మీకు తెలుసా.? కోవిడ్ పేరు చెప్పి రూ.40 వేల కోట్లు కొల్లగొట్టారు' అని యత్నాల్ శుక్రవారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. 'రూ.45 ఖరీదు ఉండే మాస్కును కోవిడ్ సమయంలో రూ.485 ఖరీదుతో అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసింది' అని యత్నాల్ ఆరోపించారు. 'బెంగళూరులో 10 వేల పడకలతో ఆసుపత్రి ఏర్పాటు చేశామని అప్పటి బిజెపి ప్రభుత్వం ప్రకటించింది. ఈ పడకలు (బెడ్లు) అన్నీ అద్దెకు తీసుకొన్నవే. ఒక పడకను అద్దెకు తీసుకున్న ధరతో రెండు పడకలను కొనుగోలు చేయవచ్చును. ఒక పడకకు రోజుకు రూ.20 వేల అద్దె చెల్లించారు. రూ 20 వేలతో సెలైన్ స్టాండ్లు ఉన్న రెండు మంచాలు కొనుగోలు చేయవచ్చు' అని యత్నాల్ తెలిపారు. కరోనా విజృంభణ సమయంలో అంటే 2019 జులై నుంచి 2021 జులై వరకూ కర్ణాటక ముఖ్యమంత్రిగా యడ్యూరప్ప పదవిలో ఉన్నారు.

బిజెపి హయాంలో అవినీతికి యత్నాల్ వ్యాఖ్యలే రుజువు

కోవిడ్ సమయంలో భారీ అవినీతి జరిగిందనడానికి బిజెపి ఎమ్మెల్యే యత్నాల్ వ్యాఖ్యలే రుజువని ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. యడ్యూరప్ప ప్రభుత్వం రూ. 4 వేల కోట్ల స్కామ్‌కు పాల్పడిందని కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆరోపించిన విషయాన్ని సిద్ధరామయ్య గుర్తు చేశారు.

బహిష్కరించే ప్రయత్నం చేస్తే ఆధారాలు బయటపెడతా : యత్నాల్

ఆరోపణలు చేసిన యత్నాల్‌పై బహిష్కరణ వేటు వేయాలని కొంతమంది బిజెపి నాయకులు అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. దీనికి యత్నాల్ స్పందిస్తూ 'వారు (బిజెపి ప్రభుత్వం) ప్రతీదీ అవినీతి చేశారు. బిజెపి వారు నాకు నోటీసు ఇవ్వనివ్వండి, పార్టీ నుంచి నన్ను బహిష్కరించడానికి ప్రయత్నం చేయనివ్వండి. అప్పుడు ఆధారాలన్నీ బయటపెడతాను' అని హెచ్చరించారు.

పినరయి విజయన్ కేబినెట్‌లో
ఇద్దరు కొత్త మంత్రులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేబినెట్‌లో ఇద్దరు కొత్త మంత్రులు చేరారు. వారితో కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్త మంత్రులలో కెబి గణేష్ కుమార్, కదనపల్లి రామచంద్రన్ ఉన్నారు. ప్రమాణ స్వీకారానికి ముఖ్యమంత్రి పినరయి విజయన్, పలువురు మంత్రులు, శాసన సభ్యులు, ఉన్నతాధికారులు, ఇతర అతిథులు హాజరయ్యారు.

హమాస్ వద్ద ఉన్న ముగ్గురు బందీల కాల్చివేత

- ఇజ్రాయిల్ సైన్యం తీరుపై విమర్శలు

గాజా : హమాస్ బంధించిన ఇజ్రాయిల్‌కు చెందిన ముగ్గురు తమకు సహాయం అందించాలంటూ తెల్ల జెండా ఊపుతున్నా పట్టించుకోకుండా ఇజ్రాయిల్ సైన్యం కాల్చివేసింది. సొంత ప్రజలనే కాల్చివేసిన ఇజ్రాయిల్ సైన్యం దుశ్చర్యపై తీవ్ర విమర్శలు రావడంతో తాజాగా వివరణనిచ్చింది. ఉత్తర గాజాలోని షిజాయా ప్రాంతంలో ఈ నెల 15న జరిగిన ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు ఇజ్రాయిల్ సైన్యం పేర్కొంది. బిస్లమక్ బ్రిగేడ్ 17వ బెటాలియన్‌కు చెందిన సైనికుడు హమాస్ సభ్యులుగా భ్రమించి ముగ్గురిని కాల్చివేశాడు. కాల్పుల్లో తొలుత ఇద్దరు మరణించగా.. మూడో వ్యక్తి సమీప భవనంలోకి పారిపోయాడు. హిబ్రూ భాషలో తనను చంపవద్దని వేడుకున్నా, అతన్ని కాల్చివేశారు.

ఆర్టికల్ 370 రద్దును సమర్థించడంపై
11లోగా సుప్రీంలో రివ్యూ పిటిషన్ : తరిగామి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్టికల్ 370 రద్దును సమర్థించే నిర్ణయానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేస్తామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు మహ్మద్ యూసఫ్ తరిగామి తెలిపారు. జనవరి 11లోపు ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజంలోని భాగస్వామ్యదారులు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేస్తామని తెలిపారు. ఈ నెల 11న ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2019 ఆగస్టు 5న జారీ చేసిన రాష్ట్రపతి ఉత్తర్వుతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. ఈ సందర్భంగా తరిగామి జమ్ముకాశ్మీర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దు తీవ్ర అన్యాయం అని, జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రజల ప్రాథమిక రాజ్యాంగ హక్కులపై దాడి అని విమర్శించారు. అందుకే రివ్యూ పిటిషన్ దాఖలు చేయడానికి పిటిషనర్లతో చర్చిస్తున్నామని తెలిపారు.

'కాళేశ్వరం' వాస్తవాలను బైటపెడతాం

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ప్రపంచం అబ్బురపడే రీతిలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని గత ప్రభుత్వం చేసిన ప్రచారం తప్పని తేలింది. రూ.38 వేల కోట్లతో 16 లక్షల ఎకరాలకు నీరందించే ప్రాణహిత ప్రాజెక్టును పక్కన పెట్టి రూ.లక్ష కోట్ల భారీ వ్యయంతో బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. తద్వారా 18 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందిస్తామంటూ డాంభికాలు పలికింది. కానీ 97 వేల ఎకరాలకు మాత్రమే నీరందించగలిగింది' అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన వాస్తవ విషయాలను ప్రజలకు తెలిపేందుకు ఉత్తమ్‌తోపాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కూడిన బృందం శుక్రవారం భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించింది.



మీకోసం

బెండకాయ కూర చేయడానికి ముందు తరిగిన ముక్కల మీద కాస్త నిమ్మరసం చల్లితే జిగురు ఉండదు.

జీవన సౌరభం

ఒక్క నిమిషంలో జీవితం ఏమీ మారదు. కానీ, ఆ ఒక్క నిమిషం ఆలోచించి తీసుకున్న నిర్ణయం మాత్రం జీవితంపై ప్రభావం చూపుతుంది.

అమ్మ చెప్పింది!



బడి గంట మోగింది. చకచకా పిల్లలు అందరూ బడి నుంచి ఇళ్ళకు బయల్దేరారు. రాజు, భీముడు, రాము కలిసి నడుస్తున్నారు. వీరు ముగ్గురూ మంచి స్నేహితులు.

'అరేయ్ భీముడు! రేపు నా పుట్టిన రోజు' అన్నాడు రాజు. దానికి భీముడు 'అవునా? భలే భలే! అయితే రేపు నువ్వు మా అందరికీ చాక్లెట్లు ఇస్తావా? లడ్డూలు ఇస్తావా?' అన్నాడు. భీముడికి లడ్డూలంటే చాలా ఇష్టం. రాజు 'నేను చాక్లెట్స్, బిస్కట్స్ ఇస్తాను' అన్నాడు.

'నేను కూడా నా పుట్టిన రోజునాడు మంచి మంచి మిఠాయిలు ఇస్తాను' అన్నాడు భీముడు.

'మరి రామూ, నీ పుట్టిన రోజు నాడు నువ్వేం ఇస్తావు?' అనడిగాడు రాజు, వారితో పాటుగా వస్తున్న రాముని.

'నేను చాలా పెద్ద పెద్ద బహుమతులు ఇస్తాను. కాని ఇప్పుడు కాదు, కొంచెం పెద్దయిన తర్వాత' అన్నాడు రాము.

'అదేంటి? పెద్దయిన తర్వాత అంటున్నావు.మాకు అర్థం కాలేదు' అన్నారు రాజు, భీముడు ఒకేసారి.

దానికి రాము 'నేను ప్రతి సంవత్సరం నా పుట్టిన రోజు నాడు ఒక మొక్క నాటుతాను. అవి పెద్దవైన తర్వాత పక్షులకు గూడులా, పశువులకు నీడలా, వర్షానికి గొడుగులా, ఆకలితో ఉన్నవారికి ఆహారం పెట్టే అమ్మలా, నిరాశ్రయులకు, బాటసారులకు ఆశ్రయంలా ఉపయోగపడతాయి. నాతో మా అమ్మ ప్రతి సంవత్సరం నా పుట్టిన రోజునాడు ఒక మొక్క నాటిస్తుంది." అని చెప్పాడు రాము.

ఆ మాటలకు రాజు, భీముడు చాలా సంతోషపడ్డారు.

"మేము కూడా మా పుట్టిన రోజునాడు ఒక మొక్క నాటుతాము." అని అన్నారు. వెనుకే వస్తున్న ఉపాధ్యాయుడు వారి మాటలను విని, మరుసటి రోజు తరగతిలో అందరికీ చెప్పారు. పిల్లలందరూ రాముని అభినందిస్తూ చప్పట్లు కొట్టారు.

'పిల్లలూ! మీరు కూడా ప్రతి పుట్టిన రోజునాడు ఒక మొక్క నాటండి. అది ఎంతో మంచి పని. ఎన్నో సమస్యలకు పరిష్కారం కూడి.." అన్నారు మాస్టారు.

"ఓ ... తప్పకుండా మాస్టారూ.. మేమూ మొక్కలను నాటుతాం. ప్రేమగా సాకుతాం." విద్యార్థులు అందరూ ఒకేసారి అన్నారు, ముక్తకంఠంతో.




- ధూళిపాళ్ళ లిఖిత్ సాయి,
6వ తరగతి,
శ్రీ వేంకటేశ్వర బాల కుటీర్ పాఠశాల,
గుంటూరు.

నేను గీసిన బొమ్మ



పరసుబోయిన సాయి లోకేష్,
6వ తరగతి,
నారాయణ స్కూల్,
పెనుబల్లి,
బుచ్చిరెడ్డిపాలెం,
నెల్లూరుజిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



పప్పు లతో పలు ప్రయోజనాలు

శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉండాలంటే మంచి పోషకాలున్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. శరీరానికి పప్పు దినుసుల ద్వారా తగిన పోషకాలు లభిస్తాయి. శనగలు, మినుములు, రాజ్మా, కందులు, పెసర్ల వంటివాటిలోనూ; చిక్కుడు జాతి గింజల్లోనూ పీచు, ప్రొటీన్లు దండిగా ఉంటాయి. ఆహారంలో అన్ని రకాల పప్పులూ కవరయ్యేలా ఒక వారం పప్పుల ప్రణాళిక రూపొందించుకోవాలి.

శనగపప్పు : శరీరంలో హార్మోన్ల స్థాయిని మెరుగు పరుస్తాయి. ఈ పప్పులో కొవ్వు కూడా తక్కువే. ప్రొటీన్లు అందుతాయి. కార్బొహైడ్రేట్, ఫైబర్ కూడా పుష్కలంగా లభిస్తాయి.

కాబూలీ శనగలు : వీటిల్లోని పీచు రక్తంలో చక్కెర మోతాదులు స్థిరంగా ఉండేందుకు తోడ్పడుతుంది. తరచుగా వీటిని తీసుకుంటే మధుమేహం ముప్పు తగ్గటానికి తోడ్పడతాయి. చెడ్డ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. గుండె ఆరోగ్యానికి కూడా మంచిదే.

మినపప్పు : ఐరన్ పుష్కలంగా ఉంటుంది. రక్త హీనత సమస్య నుంచి బయట పడేలా చేస్తుంది. ఎముకలకు బలం చేకూర్చుతుంది. మధుమేహరోగులకు చాలా ఆరోగ్యదాయకం.

పెసరపప్పు : జీర్ణక్రియకు సంబంధించిన సమస్యలకు ఉపశమనం కల్గిస్తుంది. చర్మ ఆరోగ్యానికి దోహదపడుతుంది. చాలా ప్రొటీన్లు ఉంటాయి.

మసూర్ పప్పు : శరీరంలో రక్తస్థాయిలను అదుపులో ఉంచుతుంది. అతిసార, మలబద్ధకం సమస్యలకు ఉపశమనం కలిగిస్తుంది. కంటిచూపు మెరుగుదలకు దోహదమవుతుంది.

రాజ్మా : జ్ఞాపక శక్తిని పెంపొందించే ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు వీటిలో అధికంగా ఉంటాయి. క్యాన్సర్‌ను నివారించే యాంటీ ఆక్సిడెంట్లు, అల్జైమర్స్ బారిన పడకుండా చూసే థైమీన్ కూడా దండిగానే ఉంటాయి.

ఉలవలు : ఇనుము, క్యాల్షియం వంటివి దండిగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్ గుణాల గల ఫాలీఫెనాల్స్ కూడా ఎక్కువే. ఇవి క్యాన్సర్ల నివారణకు ఉపయోగపడతాయి. యాంటీబాడీలు, స్వీయ రోగ నిరోధక చర్యల్లో కనిపించే హీమగ్లుటినిన్ కూడా వీటిల్లో కనిపిస్తుంది. కొలెస్ట్రాల్, కడుపు ఉబ్బరం తగ్గటానికి దోహదపడతాయి.

సోయా బీన్స్ : వీటిలో అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇవి కండరాల నిర్మాణానికి బాగా తోడ్పతాయి.

ఆ చిత్రాలు ఎరుపెక్కిన పిడికిళ్లు ...



పోరాటం చేస్తున్న పిడికిళ్లు, మర ఫిరంగులకు ఎదురొడ్డి బందూకులు చేబూనిన వనితలు, ఎర్రని గోచి ధరించి, బల్లెంతో ఉరుకులు పెడుతున్న యువకులు, కారంపొడి, రోకళ్లందుకుని తిరుగుబాటు చేస్తున్న వారిని అంతమొందించిన యుద్ధభూమి, ఏరులై పారతున్న రుధిర భూమిలో ప్రాణాలు ఉన్నంతవరకు పోరాడుతున్న యోధులు... ఇలా ఒకటా రెండా ఆనాటి తెలంగాణ సాయుధ పోరాట అనేక దృశ్యాలను తన చిత్రాల ద్వారా కళ్లముందుంచుతున్నాడు బరిగెల్ల శ్రీనివాస్ అనే కళాకారుడు. 'బాంబుల వర్షం కురిసినా బారు ఫిరంగులు మోగినా ఎత్తిన జెండా దించకోయ్ అరుణపతాకకు జై జై' అంటూ ఆయన గీసిన చిత్రం నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఘట్టానికి సజీవసాక్ష్యం.

తెలంగాణ నల్గొండ జిల్లాకు చెందిన శ్రీనివాస్‌ది రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం. తల్లి రోజుకూలీ, తండ్రి చిరు వ్యాపారి. పోస్టుగ్రాడ్యుయేట్ చేసినా ఉద్యోగం రాని నిరుద్యోగి అతను. ఇలాంటి స్థితిలోనే చరిత్రను చాటిచెప్పేందుకు తన కుంచెను ఝుళిపిస్తున్నాడు. లైవ్ షో ద్వారా ఆయన వేసిన చిత్తరువులు వేలాది మంది అనుసరిస్తున్నారు. ఔరా అంటున్నారు.





'కళ, కళ కోసం కాదు, ప్రజల కోసం' అంటారు శ్రీనివాస్. సామాజిక సమస్యలపై అవగాహన పెంచడానికి కళను ఉపయోగించాలన్న ఆశయంతో ముందుకు సాగుతున్నారు. 'నాటి పాలకుల దౌర్జన్యాలను, రక్తమోడుతున్నా, ప్రాణాలు హరించుకుపోతున్నా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగిన రైతాంగ పోరాటాన్ని నా చిత్రాల్లో ప్రతిబింబించి ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నదే నా లక్ష్యం. ప్రపంచంలోనే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని మించిన పోరాటం మరొకటి లేదు. ఆ చరిత్ర తెలియని ఈ తరం వాళ్లకి దాన్ని తెలియజేయడమే నా ఆశయం' అని చెబుతున్నారు. నిజాం నవాబు అరాచకాలు, పేదోళ్ల వెతలు, పోరాట యోధుల సాహసాలు... ఆయన లైవ్ చిత్రాల్లో ప్రతిబింబిస్తాయి.

గొప్ప సృజనకారుడైన శ్రీనివాస్ అనేక సామాజిక అంశాలపై కూడా తన కుంచెతో అవగాహన కల్పిస్తున్నారు. బాలకార్మిక వ్యవస్థను ఉద్దేశించి 'ఆడుకునే వయసులో అడుక్కునే ఆకలి' అంటూ ఆయన చిత్రించిన హైద్రాబాద్ ట్రాఫిక్ కూడలిలో బూరలు అమ్ముకుంటున్న బాలిక చిత్రం సోషల్‌మీడియాలో పోస్టు చేసిన స్వల్ప కాలంలోనే వందలాది మందిని అనుసరించేలా చేసింది. ఇంకా బాల్య వివాహాలు, ఆకలి, పేదరికం, భ్రూణ హత్యలపై ఆయన వేసిన చిత్రాలు బాగా ప్రాచుర్యం పొందాయి. అలాగే సమాజాన్ని పీడిస్తున్న వ్యసనాల పట్ల కూడా ఆయన కుంచె కదిలించారు. 'గుట్కా తాగకు, గుటుక్కు మనకు' అన్న చిత్తరువు ఎంతోమందిని హెచ్చరించింది. మరెంతోమందికి కనువిప్పు కలిగించింది.

భాషతో పనిలేకుండా భావం చెప్పే ఇలాంటి ఎన్నో చిత్రాలు శ్రీనివాస్ చిత్రించారు. ఇంత ఆదరణ ఉన్నా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఈ కళాకారుడు ప్రస్తుతం పొట్ట నింపుకోవడం కోసం రాజకీయ నాయకుల పోర్ట్రెట్స్‌ని చిత్రిస్తున్నారు. ఫ్లెక్సీలపై పెయింటింగ్ బొమ్మలు ముద్రిస్తున్నారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు, పోరాటాలు చాటిచెప్పే ఇలాంటి కళాకారులు చాలా అరుదుగా ఉంటారు. కళ కూటి కోసం కాదు.. ప్రజల కోసమని చాటిచెబుతున్న వారందరికీ మనసారా కృతజ్ఞతలు తెలియజేద్దాం.



రంగవల్లి

20 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు



ఆర్.పెద్దింట్లు,
పెదతాడేపల్లి,
తాడేపల్లి గూడెం,
పశ్చిమగోదావరి,
80978 75495.

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496

భూములు దోచేందుకే 'ల్యాండ్ టైటిల్'

- కుప్పంలో లక్ష మెజార్టీ వస్తే 175 సీట్లుమనవే
- శాంతిపురం, రామకుప్పం సభల్లో చంద్రబాబు

ప్రజాశక్తి - శాంతిపురం, రామకుప్పం

భూములు దోచుకునేందుకే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ని వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిందని, జగన్‌లాంటి పాలకుడు రాజకీయాలకు అనర్హుడని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు జగన్ అడిగిన ఒక్క ఛాన్స్ చివరి ఛాన్స్ కావాలన్నారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా రెండోరోజు శుక్రవారం శాంతిపురం, రామకుప్పంలలో రోడ్డు షో సభల్లో చంద్రబాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కుప్పంలో లక్ష మెజార్టీ వస్తే రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలు మనవేనని అన్నారు. 'శాంతిపురం నాకు కొత్త కాదు.. ఎపుడూ వస్తూనే ఉంటాను. కానీ మీలో ఈసారి ప్రత్యేకమైన అభిమానం కనబడుతోంది.. మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా ధైర్యంగా ఉంది. నిన్న, నేడు మీ ఉత్సాహం చూశాక మన కుప్పంలో టిడిపికి లక్ష ఓట్ల మెజార్టీ కష్టం కాదనిపిస్తోంది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా టిడిపి జెండా రెపరెపలాడే నియోజకవర్గాలు రెండున్నాయి. ఒకటి కుప్పం, రెండోది హిందూపురం. హిందూపురం ఎన్‌ఆర్ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం. రెండోది మీ అభిమానంతో నేను గెలిచే కుప్పం నియోజకవర్గం' అని పేర్కొన్నారు. హంద్రీనీవాను పూర్తి చేయడానికి రేయింబవళ్లు కష్టపడ్డానని, 87 శాతం పనులు పూర్తిచేస్తే...13 శాతం పనులను పూర్తి చేయని దద్దమ్మ ప్రభుత్వమిది అని విమర్శించారు. కుప్పానికి పట్టు పరిశ్రమ తీసుకురావడమే తన లక్ష్యమని, కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేసి రైతుల ఉత్పత్తులను ప్రపంచ నలుమూలలకు ఎగుమతులు చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రూ.వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఆయన ఇంట్లో ఓ మంత్రి, ఎమ్మెల్యే, ఎంపి ఉన్నారన్నారు. ఎచ్చర్లలో ఎమ్మెల్యే వేధింపులు తట్టుకోలేక సాక్షి విలేకరి ఆత్మహత్య చేసుకున్నారని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే పిఎ కూడా ఆత్మహత్య చేసుకున్నారని విమర్శించారు. వైసిపి వాళ్లను తాను సిఎం అయ్యాక వదిలిపెట్టనని హెచ్చరించారు. రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి ఇంటికొకరు తయారవ్వాలని, భయపడితే భవిష్యత్ ఉండదని అన్నారు. అంతకుముందు ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 'ప్రతి ఒక్కరికీ నూరు రోజుల తర్వాత న్యాయం జరుగుతుందని...మన ప్రభుత్వం వచ్చాక ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుంది' అని హామీ ఇచ్చారు. కుప్పం నియోజకవర్గ దళిత నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపిలో చేరారు.



రోడ్డుషోలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

ఆరోగ్యరంగంపై ప్రత్యేక దృష్టి

- కేంద్ర శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్య రంగంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. విజయవాడలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా 1.70 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను నిర్మించినట్లు ఆయన తెలిపారు. గత తొమ్మిదేళ్లలో 350కి పైగా కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పిఎం జన్ ఆరోగ్య యోజనతో రూ.5 లక్షల బీమాతో పేదలకు ఆరోగ్య ధీమా లభిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆరోగ్య రంగ అభివృద్ధి చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. ఈ రంగంలో రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని విధాల సహకరిస్తామని చెప్పారు. సమాఖ్య స్ఫూర్తితో ఈ సహకారాన్ని ముందుకు తీసుకుపోవాలని కోరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.350 కోట్లతో మొత్తం 14 క్రిటికల్ కేర్ బ్లాక్‌లు అందుబాటులోకి వస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.16.25 కోట్లతో 13 సమీకృత ప్రజారోగ్య లేబొరేటరీలను అభివృద్ధికి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపి కేశినేని శ్రీనివాస్, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైఎస్ చైర్మన్ మల్లాది విష్ణువర్ధన్, ఆరోగ్య శాఖ స్పెషల్ సి.ఎస్ కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీలకు కేంద్రం తూట్లు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడి ఆధ్వర్యంలోని బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమానికి తూట్లు పొడుస్తోంది. గత 20 ఏళ్ల బడ్జెట్‌ను విశ్లేషిస్తే.. మోడీ ప్రభుత్వ హయాంలోని 10 సంవత్సరాల కాలంలో మొత్తం ప్రభుత్వ వ్యయంలో వాస్తవ మూలధన వ్యయం యొక్క వాటా చరిత్రాత్మక గరిష్ట స్థాయికి చేరుకుంది. మరోవైపు సబ్సిడీల వాటా దశాబ్దపు కనిష్టానికి పడిపోయింది. వ్యయాల్లో యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యుపిఎ), బిజెపి ప్రభుత్వాల వ్యయాలో స్పష్టమైన తేడా కనబడుతోంది. మోడి ప్రభుత్వ హయంలో సబ్సీడీల వ్యయాలు పదేళ్ల కనిష్టానికి పడిపోగా.. మూలధన వ్యయాలు నూతన గరిష్ట స్థాయిలకు చేరాయని యూనియన్ బడ్జెట్ డాక్యూమెంట్ల ఆధారంగా ది ప్రింట్ ఓ కథనం ప్రచురించింది. సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసింది. గ్యాస్, పెట్రోల్, విద్యుత్, ఎరువులపై ఇచ్చే సబ్సీడీలకు మంగళం పాడగా.. అనేక సంక్షేమ కార్యక్రమాలకు కోతలు పెట్టింది.

యుపిఎతో పోల్చితే అంతా రివర్స్..

మూలధన పెట్టుబడులపై దృష్టి సారించటం కారణంగా దాని ప్రభావం సబ్సిడీల వాటాపై పడుతుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ పాలనను నిందిస్తూ ఎప్పుడూ ఆరోపణలు చేసే మోడి సర్కారు.. ఈ విషయంలో మాత్రం మిన్నకుండినట్లు వ్యవహరించింది. యుపిఎ, ఎన్‌డిఎ పాలనాకాలం 2004-24 కాలంలో చేసిన లోతైన విశ్లేషణలో పలు అంశాలు వెల్లడయ్యాయి. తాజా బడ్జెట్ ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్స రానికి ప్రభుత్వ వాస్తవ మూలధన వ్యయం దాని మొత్తం వ్యయంలో 18.6 శాతంగా ఉంది. ఇది గత 20 ఏళ్లలోనే అత్యధికం. 2020-21 మహమ్మారి సంవత్సరం నుంచి ఇది పెరుగుతుంది. మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత 2014-15 నుంచి మొత్తం ప్రభుత్వ వ్యయంలో సబ్సిడీల వాటా క్షీణిస్తోంది.



2023-24లో మొత్తం వ్యయంలో మూలధన వ్యయం 22.2 శాతం వాటాగా ఉంది. ఇది 2014-15లో 11.8 శాతంగా ఉంది. 2018-19 నాటికి ముగిసే ఇది 13.3 శాతానికి పెరిగింది. ఇక రెండో సారి మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూలధన వ్యయాన్ని అమాంతం పెంచుతూ.. సబ్సీడీలకు కత్తెరలు వేస్తోంది. ఇది యుపిఎ దశాబ్ద కాలంలో జరిగిన దానికి భిన్నంగా వ్యవహరించింది.



పొదుపు చర్యలపై పెల్లుబికిన ప్రజాగ్రహం

- వీధుల్లోకి వచ్చిన అర్జెంటీనా యూనియన్లు

బ్యూనస్ ఎయిర్స్: మితవాద మిలే ప్రభుత్వ పొదుపు చర్యలపై అర్జెంటీనాలో పెద్దయెత్తున నిరసనాగ్రహాలు వ్యక్తమయ్యాయి. అధికారం చేపట్టిన కొద్ది రోజులకే పొదుపు చర్యల పేరుతో పేదలకు ఉద్దేశించిన రాయితీలపై ఎడాపెడా కోతలు పెట్టిన మిలే ప్రభుత్వ చర్యల పట్ల ప్రజలు కుతకుతలాడుతున్నారు. ప్రభుత్వ ఆర్థిక సంస్కరణలను సవాల్ చేస్తూ, రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో కార్మిక సంఘాలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి., అధ్యక్షుడు జేవియర్ మిలీ జారీ చేసిన పొదుపు చర్యల డిక్రీని వ్యతిరేకిస్తూ ఇజ్రాయిల్ అంతటా నిరసనలు హోరెత్తాయి. కార్మిక రక్షణలను తొలగించే చర్యలను అడ్డుకోవాలని అర్జెంటీనాలోని రెండు ప్రధాన యూనియన్ ఫెడరేషన్లు, సిజిటి, సిటిఎ ఆ దేశ అత్యున్నత న్యాయ స్థానాన్ని కోరాయి. అయితే యూనియన్ల విజ్ఞప్తిని న్యాయమూర్తి తిరస్కరించారు. దేశంలోని "రాజకీయ కులానికి" వ్యతిరేకంగా దీర్ఘకాలంగా విరుచుకుపడిన మిలీ, పార్లమెంటును బైపాస్ చేస్తూ నిరంకుశంగా ఈ డిక్రీ జారీ చేశాయి. మిలీ నేతృత్వంలోని తీవ్రవాద మితవాద ఫ్రీడమ్ అడ్వాన్సెస్ పార్టీకి 257 మంది సభ్యుల దిగువ సభలో 40 సీట్లు మరియు 72 సెనేటర్లలో ఏడుగురు ఉన్నారు. నిర్మాణ కార్మికుల సంఘం నాయకుడు గెరార్డో మార్టినెజ్ మాట్లాడుతూ: "మేము అధ్యక్షుడి చట్టబద్ధతను ప్రశ్నించడం లేదు, అయితే అధికారాల విభజనను గౌరవించే అధ్యక్షుడు కావాలి అని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పొదుపు చర్యల ఉద్దేశం యూనియన్ కార్యకలాపాలను అడ్డుకోవడం, కార్మికులను శిక్షించడం, వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వం దిగి రాకుంటే సార్వత్రిక సమ్మెకు వెళ్తామని కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. "దేశం అమ్మకానికి లేదు!" అంటూ నినదించారు. డిసెంబరు 10న అధికారం చేపట్టినప్పటి నుండి, దేశ కరెన్సీ విలువ 50 శాతానికి పడిపోయింది. రవాణా మరియు ఇంధన సబ్సిడీలపై ప్రభుత్వం కోత పెట్టింది.

బిసిలకు ప్రత్యేక మేనిఫెస్టో

- 4 నుంచి 'జయహో బిసి' : లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు 'జయహో బిసి' కార్యక్రమం నిర్వహించనున్నామని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చెప్పారు. జనవరి 4 నుంచి పార్లమెంటు, అసెంబ్లీ, మండల స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. టిడిపి కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టరును ఆ పార్టీ నేతలతో కలిసి శుక్రవారం విడుదల చేశారు. బిసిల కోసం ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసి వారి కోసం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం తరహా రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. గిరిజన ద్రోహి జగన్ రెడ్డి అనే కరపత్రాన్ని అచ్చెన్నాయుడు.. టిడిపి ఎస్‌టి సెల్ అధ్యక్షులు ధారునాయక్‌తో కలిసి పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కాగా వైసిపి రానున్న రాజకీయ సునామీలో ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోతుందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు విమర్శించారు.



విశేషంగా ఆకట్టుకున్న పల్సర్ బైకు ఝాన్సీ బృందం

ఉక్కు రక్షణకు గళమెత్తిన కళాకారులు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం విశాఖలో కళాకారులు గళమెత్తారు. డ్యాన్సులతో అదరగొట్టారు. గాజువాక లంకా గ్రౌండ్స్‌లో ప్రజానాట్య మండలి ఆధ్వర్యాన ధూం ధాం కార్యక్రమం శుక్రవారానికి రెండో రోజుకు చేరుకుంది. శ్రీకాకుళం నుండి వచ్చిన కళాకారుడు వర్మ 'విశాఖ ఉక్కురా.. తెలుగు ప్రజల హక్కురా.. కదం తొక్కరా' పాటతో ఆకట్టుకున్నారు. 'ఉక్కు సంకల్పం' సినిమాలోని గీతానికి పల్సర్ బైకు ఝాన్సీ చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు ఉద్యమానికి కళాకారుల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ధూం ధాంకు ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. ఉక్కు పరిరక్షణలో కళాకారుల పాత్ర మరువలేనిదని తెలిపారు. ఉక్కు సత్యాగ్రహం సినిమా దర్శకుడు సత్యారెడ్డి మాట్లాడుతూ... తన చిత్రం అందరిలో చైతన్యం రేకెత్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎం.రమేష్ కుమార్, డాక్టర్ బి.గంగారావు, కెఎం.శ్రీనివాసరావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరాం పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68